

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 20.08.2025 | సంపుటి : 2 | సంచిక :198 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Wednesday | 20.08.2025 | volume : 2 | Issue : 198 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575




# ఆన్‌లైన్ బెట్టింగ్ ఇక నేరమే..

ఆన్‌లైన్ బెట్టింగ్‌ను అరికట్టే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకురాబోతోంది. దీనికి ప్రధాని మోదీ నేతృత్వంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల కాలంలో పెచ్చరిల్లుతున్నాయి. ఈ యాప్స్‌కు బానిసలై కొందరు అప్పుల ఊబిలో చిక్కుకోగా.. మరికొందరు ప్రాణాలు తీసుకుంటున్నారు. పలువురు సినీ, క్రీడా ప్రముఖులు ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ యాప్స్‌పై నిషేధం ఉంది. అయినప్పటికీ నిఘా వ్యవస్థల కళ్లుగప్పి కొందరు వీటిని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బెట్టింగ్ యాప్స్‌పై చర్యలకు కేంద్రం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

- బెట్టింగ్ యాప్‌లకు ముకుతాడు
- బెట్టింగ్‌కు పాల్పడితే శిక్ష, భారీ జరిమానాలు
- ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు కేబినెట్ ఆమోదం
- నేడు పార్లమెంట్‌ముందుకు బిల్లు వచ్చే అవకాశం

10





# కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టులో సవాల్

నివేదికపై స్టే ఇవ్వాలని కేసీఆర్, హరీష్ రావు పిటిషన్లు

## త్వరలో అసెంబ్లీలో చర్చకు రానున్న సమయంలో పిటిషన్లు

## హైకోర్టుకు వెళ్లడంతో మరోమారు కాళేశ్వరంపై సర్వత్రా చర్చ

హైదరాబాద్, ఆగస్టు 19 :
కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషన్ హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణ అర్హత లేదని, కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ చైర్మన్‌గా జ్యుడిషియల్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విచారణకు నియమించింది. దాదాపు 16 నెలలు ఘోష్ కమిషన్ నాటి ముఖ్యమంత్రి, అప్పటి సాగునీటి, ఆర్థిక మంత్రులు, ఐఏఎస్, ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థలు, ప్రజాసంఘాలు, పాత్రికేయులు, ముందుకొచ్చిన ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించింది. కేసీఆర్, హరీష్ రావు, ఈటలను ప్రశ్నించి వారి వివరణను విశ్లేషించింది. కమిషన్ నివేదికను మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై హైకోర్టుకు వెళ్లారు. ఈ మేరకు ఇద్దరూ హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు.

02



10

## 'ఆ ఫేక్ యాప్‌తో జాగ్రత్త'

బలగాలకు 'సీఆర్పీఎఫ్' అలర్ట్



## తక్షణమే కేబుల్ వైర్లు కట్ చేయండి

- ప్రమాదకారక కేబుళ్లను లేకుండా చూడాలి
- అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి ఆదేశం

02



03

## హైదరాబాద్‌లో మరో దుర్ఘటన

- వినాయక విగ్రహం తరలిస్తుండగా విద్యుత్ షాక్
- హైటెన్షన్ వైర్ తగలడంతో ఇద్దరు యువకుల దుర్మరణం

# ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి పోటీ

- ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- ఉదయం సమావేశమై ఖరారు చేసిన విపక్ష నేతలు

04

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీకి నిలపాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఈ మేరకు ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా తెలంగాణకు చెందిన విశ్రాంత జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి పేరును ఇండియా కూటమి మంగళవారం ఖరారు చేసింది. జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి.. గతంలో సుప్రీంకోర్టు న్యాయ మూర్తిగా పని చేశారు.



## తెలుగు వాడిని ఉపరాష్ట్రపతిగా ఎన్నుకుందాం

- పార్టీలకతీతంగా ఎన్టీఆర్ స్ఫూర్తితో ఓటేద్దాం
- రాజ్యాంగ పరిరక్షణకు ఈ ఎన్నిక ఎంతో ముఖ్యం
- తెలుగు రాష్ట్రాల పార్టీల నేతలకు సీఎం రేవంత్ విజ్ఞప్తి

02



## రైతులకు అన్యాయం చేయొద్దు

- తక్షణమే యూరియా కోటా విడుదల చేయండి
- కేంద్రానికి సిఎం రేవంత్ రెడ్డి వినతి

02

# పెట్రో, డీజిల్‌పై పన్నులు ఎత్తేయాలి

- గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి
- చేనేతపై 5 శాతం జీఎస్టీ పూర్తిగా ఎత్తేయాలి
- జీఎస్టీ కౌన్సిల్ భేటీ సందర్భంగా కేటీఆర్ బహిరంగ లేఖ

ఈ నెల 20న జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రానికి బహిరంగ లేఖ రాశారు. గత పుష్కరకాలంగా లక్షల కోట్ల రూపాయలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ రేట్ల రూపంలో ప్రజల నుంచి దోచుకుంది. ధరల తగ్గింపుపైన చిత్తశుద్ధి ఉంటే దానికి ప్రాథమిక కారణమైన పెట్రో ధరలను తగ్గించాలంటూ కేటీఆర్ డిమాండ్ చేశారు.

03





# విద్యా ఉద్యోగాల్లోనే రిజర్వేషన్లు

## రాజకీయ రిజర్వేషన్లు అవసరం లేదు

- ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించడం లేదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీ ప్రత్యామ్నాయం
- వికారాబాద్ పర్యటనలో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు

02

# అమెరికాలో 6,000 మందికి విద్యార్థి వీసాలు రద్దు

## అమెరికా విదేశాంగశాఖ వెల్లడి

అమెరికాలో నిబంధనలు ఉల్లంఘించిన విద్యార్థుల పై కఠిన చర్యలు తీసుకొంటున్నారు. తాజాగా 6,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్లు బీబీసీ రిపోర్టులో పేర్కొంది. అమెరికా విదేశాంగశాఖ ఈవిషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. 4,000 మంది దేశ చట్టాలు ఉల్లంఘించడం, దాడులు, మత్తులో డ్రైవింగ్, దోపిడీలకు పాల్పడటం వంటివి చేసినట్లు తెలుస్తోంది. అమెరికా చట్టాల్లోని ఐఎన్ఏ 3బీ కింద ఉగ్రవాదానికి పాల్పడిన దాదాపు 300 మంది కూడా ఈ జాబితాలో ఉన్నారు.





10



## తెలంగాణ కోటా యూరియాను ఇవ్వండి

- రైతులను ఇబ్బందులు పడకుండా చూడండి
- బిజెపి, బిఆర్ఎస్ కుట్రలు మానితే మంచిది
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

03



# ప్రధానితో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భేటీ

- ఇరు దేశాల మధ్య సంబంధాలపై చర్చ
- సానుకూల సమావేశంగా ప్రధాని మోడీ వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 :** భారత్-చైనా సంబంధాలలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. భారత్, చైనా మధ్య సంబంధాలు స్థిరమైన పురోగతిని సాధించాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. గత ఏడాది రష్యాలోని కజాన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తన భేటీ అనంతరం పరిస్థితుల్లో సానుకూల మార్పు వచ్చిందన్నారు. భారత పర్యటనలో ఉన్న చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీ మంగళవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. అనంతరం ప్రధాని ఈ మేరకు ట్వీట్ చేశారు.వాంగ్ యీని కలవడం ఆనందంగా ఉంది. గతేడాది కజాన్‌లో జిన్‌పింగ్‌తో సమావేశమైనప్పటినుంచి.. ఇరుదేశాల సంబంధాలు స్థిరమైన పురోగతిని సాధించాయి. పరస్పర ప్రయోజనాలు, సున్నిత అంశాలను గౌరవించడం ద్వారా ఇది సాధ్యమైంది. చైనాలోని తియాంజిన్‌లో నిర్వహించనున్న 'షాంఘై సహకార సంస్థ' శిఖరాగ్ర సదస్సు సమయంలో జిన్‌పింగ్‌తో సమావేశం కోసం ఎదురు చూస్తున్నాను. భారత్, చైనాల మధ్య స్థిరమైన, నిర్మాణాత్మక సంబంధాలు.. ప్రాంతీయ, ప్రపంచ శాంతికి, అభివృద్ధికి దోహదపడతాయని ప్రధాని మోదీ'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్ తదితరులతో వాంగ్ యీ సమావేశమైన విషయం తెలిసిందే. పరస్పర గౌరవం, సున్నితత్వం, ప్రయోజనాల ఆధారంగా ఇరుదేశాల సంబంధాలు ముందుకు సాగాలని జైశంకర్ ఆకాంక్షించారు. చైనాలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో జరిగే ఎస్‌సీవో సదస్సుకు ప్రధాని మోదీ హాజరవుతున్నారని అజిత్ డొభాల్ అధికారికంగా ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక నివాసం 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీని సాదరంగా ఆహ్వానించారు. ఇది కేవలం ఒక సాధారణ టీ-సమావేశం మాత్రమే కాదు. అత్యంత కీలకమైన దౌత్య సమావేశమని చెప్పవచ్చు. రెండు దేశాల మధ్య గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ భేటీ-కి చాలా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానంగా 2020లో లడఖ్ గాల్వాన్ లోయ వద్ద జరిగిన ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారాయి. అలాంటి సమయంలో ఇద్దరు ప్రముఖ నేతలు ఒకే టేబుల్ వద్ద కలవడం ఆసక్తికరంగా మారింది. వాంగ్ యి మూడు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చారు. ఇది భారత్-చైనా సంబంధాలలో పురోగతి సాధించే విషయమని చెప్పొచ్చు. ఈ సమావేశం సైనిక, దౌత్యపరమైన చర్చలను ముందుకు తీసుకెళ్లడం పై దృష్టి సారించింది. 2020 నుంచి రెండు వైపులా లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ వెంబడి ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరు దేశాలు కష్టపడుతున్నాయి. మోదీ, వాంగ్ యి ఈ సమ్మిట్ కోసం ఎజెండాను నిర్ణయించనున్నారు. దీంతోపాటు- రెండు దేశాల మధ్య సహకారాన్ని ఎలా బలోపేతం చేయడం, ఇటీ-వలి ద్వైపాక్షిక సంబంధాల గురించి కూడా చర్చించే అవకాశం ఉంది. ఉద్రిక్తతలను తగ్గించడానికి, సంబంధాలను బలోపేతం చేయడానికి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.



# విద్యా ఉద్యోగాల్లోనే రిజర్వేషన్లు

- రాజకీయ రిజర్వేషన్లు అవసరం లేదు
- ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించడం లేదు
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు బీజేపీ ప్రత్యామ్నాయం
- వికారాబాద్ పర్యటనలో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు

**వికారాబాద్, ఆగస్టు 19 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను సైతం మోసం చేస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. రాబోయే ఏ ఎన్నికలు అయినా బీజేపీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లాలో పర్యటించిన ఆయన, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా జిల్లాకు వచ్చారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాంచందర్‌రావుకు ఘన స్వాగతం పలికారు. బీజేపీ శ్రేణులు గజమాలతో సన్మానించారు. తేజ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న రాంచందర్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేశాయని ధ్వజమెత్తారు. విద్య, ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్లు ఉండాలని, రాజకీయాల్లో అవసరం లేదని అన్నారు.

### మతం ఆధారంగా రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని... నిజంగా చిత్తశుద్ధి ఉంటే, బీసీ జాబితాలో ముస్లింలను ఎందుకు చేరుస్తున్నారని ప్రశ్నించారు. బీసీలకు ఇప్పటికే బీసీ-బీ, బీసీ-ఈ, ఈబీసీ కింద రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని, అవి విద్యా, ఉద్యోగాల్లో మాత్రమే ఉండాలని... రాజకీయాల్లో మాత్రం ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. మతం ఆధారంగా రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయంగా తెలంగాణ ప్రజలు నమ్మకంతో బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. రైతు బంధు నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షలాది మంది రైతులకు ఏ ఒక్కసారి ఆపకుండా పీఎం కిసాన్ యోజన నిధులు జమ చేస్తున్నారని తెలిపారు. రిటైర్మెంట్ డబ్బులు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ఉద్యోగులు నేడు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు "కేంద్రం యూరియా ఇవ్వడం లేదు" అనే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని... రైతుల ఇబ్బందులకు నిజమైన కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు.

### మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా సరఫరా సరిగ్గా జరగడం లేదు

మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా సరఫరా సరిగ్గా జరగడం లేదని, ఎరువుల దుకాణాల్లో యూరియా దొరకకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సిగ్గుచేటని రాంచందర్‌రావు విమర్శించారు. రాబోయే రోజుల్లో ఏ శక్తి అడ్డొచ్చినా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ ఒకే తీరుగా పాలనలో వైఫల్యం చెందాయని చెప్పారు.

# కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టులో సవాల్

- నివేదికపై స్టే ఇవ్వాలని కేసీఆర్, హరీష్ రావు పిటిషన్లు
- త్వరలో అసెంబ్లీలో చర్చకు రానున్న సమయంలో పిటిషన్లు
- హైకోర్టుకు వెళ్లడంతో మరోమారు కాళేశ్వరంపై సర్వత్రా చర్చ



**హైదరాబాద్, ఆగస్టు 19 :** కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషన్ హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణ అర్హత లేదని, కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ చైర్మన్‌గా జ్యుడిషియల్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విచారణకు నియమించింది. దాదాపు 16 నెలలు ఘోష్ కమిషన్ నాటి ముఖ్యమంత్రి, అప్పటి సాగునీటి, ఆర్థిక మంత్రులు, ఐఏఎస్, ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థలు, ప్రజాసంఘాలు, పాత్రికేయులు, ముందుకొచ్చిన ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించింది. కేసీఆర్, హరీష్ రావు, ఈటలను ప్రశ్నించి వారి వివరణను విశ్లేషించింది. గత నెల 31వ తేదీన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. కమిషన్ నివేదికను మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై హైకోర్టుకు వెళ్లారు. ఈ మేరకు ఇద్దరూ హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు.

### రాజకీయ కక్ష సాధింపే లక్ష్యమా?

రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ప్రభుత్వం కాళేశ్వరం కమిషన్ వేసిందని కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలని కేసీఆర్, హరీష్ రావు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి ఏది కావాలో కమిషన్ నివేదిక ఆ రకంగానే ఉందని వారు ఆరోపించారు. వీరి పిటిషన్లు 2025, ఆగస్టు 20న విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కేసీఆర్, హరీష్ రావు పిటిషన్లపై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఉత్కంఠ నెలకొంది.

### పూర్వపు నిర్మాణాలపై విచారణ

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవ కలపై విచారణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. 2024, మార్చి 14న జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ దాదాపు 15 నెలల పాటు విచారణ జరిపింది. వీటికి సంబంధించిన డీపీఆర్‌లు, డిజైన్‌లను పరిశీలించిన కమిషన్ విజిలెన్స్ రిపోర్ట్ ఆధా రంగా ఇరిగేషన్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల ను విచారించింది. విచారణలో భాగంగా అప్పటి సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ఇరిగేషన్ మంత్రి హరీష్ రావును కూడా కమిషన్ విచారించింది. అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు ఇలా మొత్తం 115 మందిని విచారించి వారి స్టేట్మెంట్లు రికార్డ్ చేసింది కమిషన్. వారి వాంగ్మూలాలను విశ్లేషించి తుది రిపోర్టును తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించింది.

### రిపోర్టు పట్ల ఉత్కంఠ.. స్టే కోరిన బీఆర్‌ఎస్

కాళేశ్వరం ఫైనల్ రిపోర్ట్ ప్రభుత్వానికి చేరడంతో అందులో ఏముందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ కాపీ ఇవ్వాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోరగా అందుకు ప్రభుత్వం "నో" చెప్పింది. కమిషన్ రిపోర్టును నేరుగా అసెంబ్లీలోనే టేబుల్ చేసి చర్చ జరుపుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ తరుణంలో కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలని కోరుతూ కేసీఆర్, హరీష్ రావు కోర్టు మెట్లు ఎక్కడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# తెలుగు వాడిని ఉపరాష్ట్రపతిగా ఎన్నుకుందాం

- పార్టీలకతీతంగా ఎన్టీఆర్ స్ఫూర్తితో ఓటేద్దాం
- రాజ్యాంగ పరిరక్షణకు ఈ ఎన్నిక ఎంతో ముఖ్యం
- తెలుగు రాష్ట్రాల పార్టీల నేతలకు సీఎం రేవంత్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 19 :** పార్టీలకు అతీతంగా తెలుగువాడైన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతిగా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయనను కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపిక చేయలేదని, ఇండియా కూటమి అభ్యర్థిగా మాత్రమే ఎంపిక చేశామని అన్నారు. పీవీని నంద్యాల నుంచి ఎన్నుకునే సమయంలో ఆనాడు ఎన్టీఆర్ ఏకగ్రీవ ఎన్నికకు పిలుపునిచ్చారని, ఆయన స్ఫూర్తితో మనమంతా తెలుగువాడైన సుదర్శన్ రెడ్డిని గెలిపించుకుందామని అన్నారు. దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను ఎన్డీఏ దుర్వినియోగం చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థలను ఎన్డీఏ అపహాస్యం చేస్తోంది. రాజ్యాంగ రక్షణ కోసం పోరాడుతున్న కూటమి ఒక వైపు రాజ్యాంగాన్నే రద్దు చేయాలని చూస్తున్న కూటమి మరో వైపు ఉంది. పీవీ నరసింహారావు తర్వాత తెలుగువాడిని కీలక పదవిలో కూర్చోబెట్టే అవకాశం మనకు వచ్చింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఏకతాటి విధానానికి రావాలి. తెదేపా, వైకాపా, భారత రాష్ట్ర సమితి, ఎంఐఎం సహా అన్ని పార్టీలు ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలపాలి. చంద్రబాబు, కేసీఆర్, జగన్, పవన్ కళ్యాణ్ కు విజ్ఞప్తి చేస్తున్నా. రాజకీయాలకు అతీతంగా తెలుగు రాష్ట్రాల నేతలంతా కలిసి రావాలి.

### తెలుగు నేతలంతా సహకరించాలి

ఆనాడు ప్రధాని పీవీ నరసింహారావుకు ఎన్టీఆర్ మద్దతు ఇచ్చారు. నంద్యాల ఉపఎన్నికలో పీవీపై పోటీ పెట్టకుండా గెలిపించారు. తెలుగువాడు అత్యున్నత స్థానంలో ఉండాలనే భావనతో సహకరించారు. ఇప్పుడు మరోసారి తెలుగు నేతలంతా ఎన్టీఆర్ స్ఫూర్తితో సహకరించాలి. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చారు. న్యాయమూర్తిగా, లోకాయుక్తగా దేశానికి సేవలందించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



పార్టీలకతీతంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడం తెలంగాణ ప్రజలకు గర్వ కారణమని అన్నారు.

### పార్టీలకతీతంగా సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలి

కేసీఆర్, చంద్రబాబు, జగన్, ఒవైసీ ఒకే మాటపై నిలబడి పార్టీలకతీతంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. దేశంలో రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందని ఓట్ల చోరీతో దేశాన్ని పరిపాలించాలని చూస్తున్నారని అన్నారు సీఎం రేవంత్. రాజ్యాంగాన్ని రక్షించడం అందరి బాధ్యత అని రాజ్యాంగ సంస్థలను రక్షించుకోవడం ఇప్పుడు అవసరమని అన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని చేస్తున్నవారిని ఓడించాలని, రైతు కుటుంబంలో జన్మించిన సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించడమే కాకుండా రాజ్యాంగ నిపుణుడిగా సుదర్శన్ రెడ్డికి పేరు ఉందని అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించినందుకు ఇండియా కూటమికి తెలంగాణ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు సీఎం రేవంత్. తెలుగు రాష్ట్రాల ఎంపీలంతా ఒక తాటిపైకి వచ్చి సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, శ్రీధర్ బాబు, పొంగులేటి, పొన్నం ప్రభాకర్, పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అన్యాయం చేయొద్దు

- తక్షణమే యూరియా కోటా విడుదల చేయండి
- కేంద్రానికి సిఎం రేవంత్ రెడ్డి వినతి

**హైదరాబాద్, ఆగస్టు 19 :** తెలంగాణ రైతాంగానికి అవసరం మేరకు యూరియాను తక్షణం సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణపై వివక్ష చూపించొద్దని అన్నారు. కేటాయించిన వాటా మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా చేయకపోవడంతో తలెత్తుతున్న సమస్యలను తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర మంత్రులకు వివరించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రానికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు రైతాంగానికి తలెత్తాయని పేర్కొన్నారు. ఈ విషయంలో పార్లమెంట్ సభ్యులు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. యూరియా సరఫరా విషయంలో సీఎం రేవంత్ స్వయంగా కేంద్ర మంత్రికి వివరించడమే కాకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు దఫాలుగా లేఖలు రాసిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ రాష్ట్ర అవసరాల మేరకు యూరియా సరఫరా చేయకుండా కేంద్రం వివక్ష చూపుతోందని అన్నారు. రైతుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా ఎంపీలు ఆందోళన సాగిస్తున్నప్పటికీ కోటా మేరకు యూరియా విడుదల చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆక్షేపించారు. అవసరమైన మేరకు తక్షణం యూరియా సరఫరా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

# భవిష్యత్ అంతా హార్టికల్చర్‌దే

- శ్రమిస్తే ఐటి రంగంకన్నా మిన్నగా ఉద్యోగాలు
- వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, ఆగస్టు 19 :** కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీలో అక్షయ డైనింగ్ హాలును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. భారతదేశంలోనే అన్ని సౌకర్యాలతో హార్టికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు- చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. మిగతా అన్ని రంగాల కంటే వ్యవసాయరంగానికే అత్యంత ప్రాధాన్యం ఉంది. భవిష్యత్తు అంతా వ్యవసాయానిదే. గత 4 సంవత్సరాల క్రితం కరోనా సమయంలో అన్ని వ్యవస్థలు మూతపడినా, నాగలి ఆగలేదు. రైతు శ్రమ ఆగలేదు. ఇంకా ఎక్కువ మొత్తంలో దిగుబడులు సాధించడం జరిగింది. హార్టికల్చర్ విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉటుందని, విద్యార్థులుగా ప్రావీణ్యతను పెంచుకుంటే, సాఫ్ట్ వేర్ ఉద్యోగుల కన్నా, మీకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు మొత్తం కోర్సులో సగానికి కన్నా ఎక్కువ రోజులు పొలాల్లో ఉండి, వ్యవసాయంలో ప్రావీణ్యం సంపాదించుకోవాలని, రైతు చేసే వ్యవసాయ విధానాలను పరిశీలించాలని తెలిపారు. హార్టికల్చర్ పంటలను అభివృద్ధి చేస్తే, అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, దేశంలో లక్ష కోట్లతో పామాయిల్ దిగుమతి చేసుకోవడం జరుగుతుందని, పామాయిల్ దిగుమతి తగ్గించాలంటే, ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న 13 లక్షల ఎకరాలలో ఉన్న పామాయిల్ పంటను 70 లక్షల ఎకరాలకి విస్తరించినట్లయితే, డిమాండ్ ను అధిగమించడానికి అవకాశం ఉంటు-ందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2.65 లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయడం జరుగుతుందని, ఆయిల్ పథకాన్ని అమలు చేయడంలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలోఉందని, రానున్న 4 సంవత్సరాలలో రాష్ట్రంలో పామాయిల్ పంటను 10 లక్షల ఎకరాలకు రాష్ట్రంలో విస్తరించడానికి ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. కూరగాయలు, పండ్ల తోటలతో పాటు-గా జాజి, వక్క, మెకడమియా లాంటి అన్ని పంటలను పండించడానికి తెలంగాణ నేలలు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. భవిష్యత్తు అంతా హార్టికల్చర్ దే అని నేను భావిస్తున్నానని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరగడానికి ఉద్యానపంటలు ఒక గ్రోత్ ఇంజన్ గా నిలుస్తున్నాయని మంత్రిగారు పేర్కొన్నారు. హార్టికల్చర్ శాస్త్రవేత్తలు, రైతులు హార్టికల్చర్ పంటలు సాగుచేయడానికి అవసరమైన పరిశోధనలను విస్తృతం చేసి, సూచనలు సలహాలు అందించాలని మంత్రిగారు పేర్కొన్నారు. యూనివర్సిటీ-లో పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక బోధన విషయాలలో పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రిగారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకమిషన్ చైర్మన్ శ్రీ కోదండ రెడ్డి , వైస్ చాన్స్ లర్ రాజిరెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరి శ్రీ రఘునందన్ రావు, వ్యవసాయ కమిషన్ సభ్యులు, యూనివర్సిటి ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



# తక్షణమే కేబుల్ వైర్లు కట్ చేయండి

- ప్రమాదకారక కేబుళ్లను లేకుండా చూడాలి
- అధికారులకు డిప్యూటి సిఎం భట్టి ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 19 :** విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇటీవల రాష్ట్రంలో పలుచోట్ల టీవీ, ఇంటర్నెట్ కేబుళ్ల (వైర్లు) ఏర్పాటులో నిర్లక్ష్యంతో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తాజాగా హైదరాబాద్ రామంతాపూర్‌లో ఐదుగురి మృతికి రోడ్డుకు అడ్డంగా లాగిన కేబుల్ తెగి విద్యుత్‌లైనుపై పడటమే కారణమని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీంతో మంగళవారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి సమీక్షా నిర్వహించారు. అనుమతులు లేకుండా ఎలాంటి విద్యుత్ కనెక్షన్లు ఉన్నా వెంటనే తొలగించాలన్నారు. కేబుల్ వైర్ల తొలగింపునకు ఏడాది సమయం ఇచ్చినా ఆపరేటర్లు స్పందించలేదన్నారు. వారి నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అధికారులతో సమీక్షించిన భట్టి వరుస ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలకు కారకంగా ఉన్న కేబుల్ వైర్లను కట్ చేయాలన్నారు.

# రామంతాపూర్ విద్యుత్ దుర్ఘటనపై హెచ్‌ఆర్‌సి సీరియస్

### నివేదిక సమర్పించాలని ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 19 :** హైదరాబాద్ రామంతపూర్‌లో శ్రీ కృష్ణుని శోభాయాత్రలో రథానికి కరెంట్ తీగలు తగిలి షాక్ కొట్టడంతో ఆరుగురు మృతి చెందిన ఘటనపై హ్యూమన్ రైట్స్ కమిషన్ సీరియస్ అయింది. సుమోటోగా కేసును స్వీకరించింది. హైదరాబాద్ రామంతపూర్‌లో కృష్ణ జన్మాష్టమి శోభ యాత్రలో ఆరుగురి ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర విషాదకరమని ఐఈ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ దుర్ఘటనకు కారణం, అధికారుల నిర్లక్ష్యం, తక్షణ పరిష్కార చర్యలు, బాధితుల కుటుంబాలకు పరిహారం.. భద్రతా చర్యలపై సెప్టెంబర్ 22వ తేదీ లోపు సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎండీకి ఆదేశాలు జారీ చేసింది. రామంతాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణుని జన్మాష్టమి సందర్భంగా రాత్రివేళ గోకుల్ నగర్ యాదవ సంఘం దగ్గర శోభాయాత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలమంది యాదవులు, ఇతర కులస్తులు పాల్గొని పూజలు చేశారు. సంబురంగా పిల్లలతో ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. రాత్రి 9 గంటలకు రథంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఉంచి.. శోభాయాత్ర మొదలుపెట్టారు. ఈ యాత్ర గోకుల్ నగర్ యాదవ సంఘం నుంచి ప్రారంభమై ఓల్డ్ రామంతాపూర్, ఆర్టీసీ కాలనీ, శారదనగర్ మీదుగా సాగింది. రాత్రి 12.15 గంటలకు గోకుల్ నగర్ యాదవ సంఘానికి చేరే క్రమంలో రథాన్ని లాగే వెహికల్ మొరాయించింది. ఎంతకీ స్టార్ట్ అవ్వకపోవడంతో దగ్గరలోనే ఉంది కదా అని సుమారు15 మంది రథాన్ని మండపానికి లాగే ప్రయత్నం చేశారు. అదే సమయంలో జోరుగా వర్షం పడుతున్నది. పై భాగంలో వేలాడుతున్న కేబుల్ వైర్‌కు తాకి రథం ముందుకు వెళ్లలేదు. దీంతో కర్రలతో ఆ కేబుల్ వైర్‌ను పైకి లేపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మెయిన్ వైరు తెగి రథానికి తాకడంతో ముందు ఇనుప కడ్డీని లాగుతున్న ఐదుగురు ఎగిరిపడ్డారు. వారిని పట్టుకుని ఉన్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దుర్ఘటనలో కరెంట్ షాక్ తగిలి మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

# ఒక్క ఫొటో వెయ్యి భావాలకు సమానం

- ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు
- ఫొటో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి: మంత్రి పొంగులేటి




**హైదరాబాద్, ఆగస్టు 19 :** ఒక్క ఫొటో వెయ్యి భావాలను తెలియచేస్తుందని, రాష్ట్రంలో ఫొటోజర్నలిస్టుల సంక్షేమానికి వారిలో ప్రొఫెషనలిజం పెంపొందించేందుకు చర్యలు చేపడుతామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలలో విజేతలకు నేడు బహుమతి, నగదు పురస్కారం అందించే కార్యక్రమానికి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సమాచారశాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక, సిఎం కార్యాలయం సీపీఆర్ఓ మల్సూర్‌లు అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, కాలాన్ని బంధించి మధుర స్మృతులను అందించే శక్తి ఒక్క ఫోటోగ్రఫర్లకే ఉంటుందని, వారిని ప్రోత్సహించే దిశగా ప్రతీ సంవత్సరం వరల్డ్ ఫోటోగ్రఫీడేను అధికారికంగా నిర్వహించి, ఫోటో కాంపిటిషన్లలో విజేతలను నగదు బహుమతులు, మెమెంటోలను ప్రదానం చేస్తున్నామని వెల్లడించారు. మాయని జ్ఞాపకాల, తీయాని కల ఫోటోగ్రఫీ అని పేర్కొంటూ, ఎన్నో దశాబ్దాలు గడిచినా ఒక్క ఫోటో మాయని గత స్మృతుల్ని తెలియ చేస్తుందని అన్నారు. రాజీవ్ గాంధీ హత్యోదంతాన్ని గుర్తు చేస్తూ, ఆ సంఘటనలో ఉన్న ఫోటోగ్రాఫర్ తీసిన చిత్రం ద్వారానే హంతకులను పట్టు-కున్న ఉదంతాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేది ఫోటో జర్నలిస్టులని అన్నారు. స్వాతంత్రోద్యమం నుండి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రచార మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వీటిలో ఫోటోగ్రఫీకి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక మాట్లాడుతూ, కాలం గడచినా, ఫోటోలు మాత్రం చెక్కుచెదరకుండా గత మధుర స్మృతులను మిగులుస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాలన్నీ సమాచార శాఖ ఆధ్వర్యంలో గత 28 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి 5 విభాగాలకు నిర్వహించిన ఫోటో కాంపిటీషన్‌కు 94 మంది పాల్గొని 744 ఫోటోలను పంపించారని చెప్పారు. ప్రధానంగా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రాజీవ్ యువ వికాసం, జనరల్ అనే ఐదు విభాగాలుగా ఎంట్రీ-లను ఆహ్వానించి ప్రతీ విభాగానికి 8 బహుమతులను ప్రకటించామని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ పోటీ-లలో పాల్గొన్న విజేతలకు నగదు , శాలువాతో పాటు- మెమెంటోను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సి.ఎస్. రామకృష్ణా రావు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీపీఆర్ఓ మల్సూర్‌లు అందచేశారు.

## మద్యంమత్తులో ఆటో డ్రైవర్ దురాగతం

### తనిఖీ చేస్తున్న మహిళా కానిస్టేబుల్‌ను ఈడ్చుకెళ్లిన డ్రైవర్

**ముంబై, ఆగస్ట్ 19 :** మహారాష్ట్రలో దారుణ ఘటన వెలుగు చూసింది. మద్యం మత్తులో ఓ ఆటో డ్రైవర్ డ్యూటీలో ఉన్న మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను దాదాపు 120 మీటర్లు ఈడ్చుకెళ్లాడు. ఈ ఘటన సతారా జిల్లాలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన షాకింగ్ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. సతారా నగరంలోని ఓ కూడలి వద్ద సోమవారం ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ ఆటోని డ్యూటీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ భాగ్యశ్రీ జాదవ్ ఆపింది. అయితే, ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో ఫైన్ తప్పించుకునేందుకు ఆపకుండా ముందుకు పోనిచ్చాడు. దీంతో సదరు మహిళా కానిస్టేబుల్ ఆటోకు అడ్డుపడింది. అయినా లెక్కచేయ కుండా డ్రైవర్ ఆమెను ఢీకొట్టి అలాగే ఈడ్చుకుంటూ వెళ్లాడు. అప్రమత్తమైన స్థానికులు ఆటోను వెంబడించి ఆపారు. అనంతరం డ్రైవర్‌ను పట్టు-కుని చితక బాది పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో మహిళా కానిస్టేబుల్‌కు స్వల్పగాయాలైనట్లు తెలిసింది. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్‌ను దేవరాజ్ కాలేగా గుర్తించారు. ఇందుకు సంబంధించిన దృష్యాలు వైరల్ అవుతున్నాయి.

## భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

**భద్రాచలం, ఆగస్టు 19 :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వల్ల భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారంఉదయానికి గోదావరి నీటిమట్టం 37 అడుగులకు చేరింది. స్నాన ఘట్టాల వద్ద చాలా మెట్లు- వరద నీటిలో మునిగాయి. కళ్యాణ కట్ట వరకు వరద నీరు చేరింది. దీంతో నదిలో స్నానాలు ఆచరించే భక్తులు లోపలికి వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పర్ణశాల వద్ద నార చీరల ప్రాంతం, సీతమ్మ విగ్రహం వరద నీటిలో మునిగాయి.

## ఇందిరమ్మ ఇళ్ల అవతవకలపై విచారణకు ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 19 :** హుజుర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని జానపహాడ్ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో జరిగిన అవకతవకలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీరియస్‌గా స్పందించారు. అవకతవకల విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే సదరు కార్యదర్శి వెంకటయ్యను సస్పెండ్ చేయడంతో పాటు ఏసీబీ కేసు నమోదు చేయాలంటూ జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. తక్షణమే రంగంలోకి దిగిన జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ సదరు కార్యదర్శి వెంకటయ్యను సస్పెండ్ చేయడంతో పాటు- ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఒకటి, రెండు రోజుల్లో వెంకటయ్య అరెస్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఎన్టీఆర్ కుటుంబంలో విషాదం

- జయకృష్ణ భార్య పద్మజ మృతి
- నివాళి అర్పించిన చంద్రబాబు తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 19 :** నందమూరి వారి ఇంట విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తనయుడు నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ మరణించారు. మంగళవారం ఉదయం ఆమె మరణించారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు పద్మజ స్వయాన సోదరి అవుతారు. పద్మజ మరణ వార్త విని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు- ఆయన కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. నందమూరి ఫ్యామిలీకి చెందిన వారంతా ఒకొక్కరుగా జయకృష్ణ నివాసానికి చేరుకొంన్నారు. నందమూరి పద్మజ భౌతికకాయానికి ఏపీ సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. మంత్రి నారాలోకేశ్, భువనేశ్వరి, బాలకృష్ణ నివాళి అర్పించారు.

# పెట్రో, డీజిల్‌పై పన్నులు ఎత్తేయాలి

- గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి
- చేనేతపై 5 శాతం జీఎస్టీ పూర్తిగా ఎత్తేయాలి
- జీఎస్టీ కౌన్సిల్ భేటీ సందర్భంగా కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్, ఆగస్టు 19:** ఈ నెల 20న జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రానికి బహిరంగ లేఖ రాశారు. జీఎస్టీ స్లాబ్ రద్దు లేదా మార్పు అంటూ కేంద్రం గత వారం రోజులుగా ప్రచారం చేసుకుంటోంది. వీటి ద్వారానే ప్రజల జీవితాల్లో నిజమైన దీపావళి వస్తుందని ప్రచారం చేస్తోంది. గత పుష్కరకాలంగా లక్షల కోట్ల రూపాయలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ రేట్ల రూపంలో ప్రజల నుంచి దోచుకుంది. ఒక వైపు ప్రతి నెల వేలాది రూపాయలు పెట్రోల్, ఎల్పీజీ, డీజిల్ రూపంలో భారం మోపుతూ జీఎస్టీ స్లాబ్ మార్పు వలన కేవలం పదుల రూపాయల భారం తగ్గిస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ధరల తగ్గింపుపైన చిత్తశుద్ధి ఉంటే దానికి ప్రాథమిక కారణమైన పెట్రో ధరలను తగ్గించాలంటూ కేటీఆర్ డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ తగ్గితే రవాణా భారం తగ్గి దాదాపు అన్ని వస్తువుల ధరలు తగ్గుతాయి. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీపై పన్నులు తగ్గించి, సెస్సులను పూర్తిగా ఎత్తివేసి మీ చిత్తశుద్ధిని నిరూపించుకోండని అన్నారు. చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశం సందర్భంగా కొన్ని కీలకమైన ప్రజా సమస్యలను మీ దృష్టికి తీసుకురావాలన్న ఉద్దేశంతో ఈ బహిరంగ లేఖ రాస్తున్నానని అన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర మంత్రిగా, ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రజల పక్షాన మా వాదనను వినిపించడం మా కర్తవ్యంగా భావిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.

### విపరీతంగా పెరిగిన ధరలు

గత పన్నెండేళ్లుగా బీజేపీ పాలనలో విపరీతంగా పెరిగిన ధరలతో దేశ ప్రజలు అల్లాడిపోతున్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజల సంపదను లూటీ చేస్తున్న ఈ భారాన్ని తగ్గించకుండా, జీఎస్టీలో నామమాత్రపు మార్పులు చేయడం వల్ల ప్రజలకు ఒరిగే ప్రయోజనం శూన్యం. పెంచిన పెట్రో, ఎల్పీజీ ధరలను తగ్గిస్తేనే రవాణా భారం తగ్గి ఆటోమెటిక్‌గా ధరాభారం తగ్గుతుంది. ఇక పెట్రో ధరలను పన్ను రూపంలో కాకుండా సెస్సుల రూపంలో పెంచడం మీరు తీసుకున్న మరో అప్రజాస్వామిక నిర్ణయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. పన్నుల రూపంలో పెంచితే వచ్చిన ఆదాయంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సి వస్తుందన్న అక్కసుతో పెట్రో రేట్లను సెస్సుల రూపంలో పెంచి మీరు రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బకొట్టాలని చూశారు. బలమైన రాష్ట్రాలు ఉంటేనే బలమైన కేంద్రం ఉంటుందన్న సమాఖ్య స్ఫూర్తిని మరిచి మీరు వ్యవహరించారు. అందుకే పెట్రో, ఎల్పీజీ రేట్లను తక్షణమే తగ్గించడంతో పాటు సెస్సులను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### నేతన్నల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రాధాన్యత


తెలంగాణ రాష్ట్రంలో నేతన్నల సంక్షేమానికి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇచ్చింది. ప్రజల అభిప్రాయాలను ఏ కొలతకూ పట్టించుకోని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ విధించింది. చేనేత వస్త్రాలపై ఇప్పుడున్న 5 శాతం జీఎస్టీని కూడా పూర్తిగా రద్దు చేయాలని మరోసారి నేను బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాను. జీఎస్టీలోని 12 శాతం స్లాబ్‌ను రద్దు చేసి, పేద, మధ్యతరగతి ప్రజలకు ఏదో మేలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇది ప్రజలను మభ్యపెట్టే మరో 'జుమ్లా' తప్ప మరొకటి కాదు.

### జీఎస్టీతో సామాన్యుడి నడ్డి విరిచిన బీజేపీ

మొత్తం జీఎస్టీ పరిధిలోని 22 లక్షల కోట్లకు పైగా వచ్చే ఆదాయంలో ఈ 12 శాతం స్లాబ్ వాటా కేవలం 5 శాతం మాత్రమే. ఇంత నామమాత్రపు వాటా ఉన్న స్లాబ్‌ను రద్దు చేసి, అందులోని వస్తువులను వేరే స్లాబుల్లోకి మార్చి దేశ ప్రజలందరినీ ఉద్ధరించినట్లు మోడీ ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదంగా కనిపిస్తుంది. గత దశాబ్ద కాలంగా పాలు, పెరుగు, పప్పు, ఉప్పు లాంటి నిత్యావసరాలపై కూడా జీఎస్టీ విధించి సామాన్యుడి నడ్డి విరిచింది ఈ బీజేపీ ప్రభుత్వం. ఇంతేకాదు, పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను అడ్డగోలుగా పెంచి లక్షల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపింది. ఈ పాపాలను కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు స్లాబ్ రద్దు అంటూ లీకులు ఇస్తూ ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు.

# హైదరాబాద్‌లో మరో దుర్ఘటన

- వినాయక విగ్రహం తరలిస్తుండగా విద్యుత్ షాక్
- హైటెన్షన్ వైర్ తగలడంతో ఇద్దరు యువకుల దుర్మరణం



**హైదరాబాద్, ఆగస్ట్ 19 :** హైదరాబాద్ రామంతాపూర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విషాదం మరువకముందే బండ్లగూడలో మరో ఘటన చోటుచేసుకున్నది. వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తుండగా విద్యుత్ షాక్‌తో ఇద్దరు యువకులు మృతిచెందారు. కొందరు యువకులు భారీ వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో బండ్లగూడ వద్ద లంబోదరుడి విగ్రహానికి హై టెన్షన్ వైరు తరగలడంతో ట్రాక్టర్‌కు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిని అఖిల్ అనే యువకుడిని దవాఖానకు తరలించారు. మృతులను టోని (21), వికాస్ (20)గా గుర్తించారు. కరెంటు షాక్‌తో ట్రాక్టర్ -టైర్లు పూర్తిగా కాలిపోయాయి. దీంతో క్రేన్ సహాయంతో వినాయక విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా రథంపై శ్రీకృష్ణుడి ఊరేగింపు కోసం ప్రత్యేక రథాన్ని తయారు చేశారు. ఆదివారం రాత్రి స్థానిక వీధుల్లో యాదవ సంఘం భవనం నుంచి శ్రీకృష్ణుడి ఊరేగింపు చేపట్టారు. ఓవైపు వర్షం పడుతుండగా మరోవైపు భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి రథయాత్ర కొనసాగింది. ఊరేగింపు దాదాపు పూర్తయి తిరిగి రథాన్ని యాదవ సంఘ భవనం వద్ద పెట్టేందుకు వెళ్తుండగా రథాన్ని ముందుకు లాగుతున్న జీపు ఆగిపోయింది. మరో వంద అడుగుల దూరం ఉండటంతో చేతులతో తోస్తూ వెళ్లారు. మరో 50 అడుగుల దూరం ఉండగానే ఆకస్మాత్తుగా రథాన్ని లాగుతున్న వాళ్లు గట్టిగా అరుస్తూ కిందపడి పోయారు. అప్పటికే రథంపై ఉన్న వాళ్లు ఏం జరిగిందో అర్థం కాక పరుగులు పెట్టారు. వేలాడుతున్న విద్యుత్తు తీగ రథానికి తగిలి షాక్ కొట్టింది. దీంతో వెనుక నుంచి తోస్తున్న వాళ్లు 9 మంది అపస్మార స్థితిలో పడిపోయారు. వారిని రక్షించేందుకు స్థానికులు కొందరికి సీపీఆర్ కూడా చేసినా ఫలితం లేకుండాపోయింది. ఐదుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో నలుగురిని చికిత్స కోసం వివిధ దవాఖానాలకు తరలించారు.



# తెలంగాణ కోటా యూరియాను ఇవ్వండి

- రైతులను ఇబ్బందులు పడకుండా చూడండి
- బిజెపి, బిఆర్ఎస్ కుట్రలు మానితే మంచిది
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 19 :** తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియా ఇవ్వకుండా కేంద్రం దోబూచులాడుతోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. తద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని బద్నాం చేసే ప్రయత్నం కేంద్రం ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాపై హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వేదికగా టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై కేంద్రం సవితి తల్లిలా వ్యవహరిస్తోందంటూ ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన యూరియా కోసం తమ పార్టీ ఎంపీలు పార్లమెంట్ వద్ద ఆందోళన చేస్తున్నారన్నారు. పార్టీ ఎంపీల ఆందోళనకు ప్రియాంక గాంధీ కూడా మద్దతు పలికారని గుర్తు చేశారు. యూరియా కోసం రైతులు రహదారి పైకి వచ్చి ఆందోళన చేస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియా వాటా ఇవ్వాల్సిందిగా ఈ సందర్భంగా కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియాను కేంద్రం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు ఆందోళన చేస్తుంటే బిజెపి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో ఉన్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి బండి సంజయ్ కి ఇది మంచి ప ద్ధతి కాదని సూచించారు. యూరియా కోసం సిఎం రేవంత్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖ రాశారని తెలియజేశారు. బిజెపి, బిఆర్ఎస్ లోపాయపాకారి ఒప్పందంతో యూరియాను అడ్డుకుంటున్నాయని, కాంగ్రెస్ అభాసుపాలు చేయాలని బిజెపి, బిఆర్ఎస్ కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు.



## ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీర

### జలదిగ్బంధంలోనే ఏడుపాయల

**మెదక్, ఆగస్టు 19 :** సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో మంజీరా ఉగ్రరూపం దాల్చింది. వన దుర్గ ఆనకట్టకు 69,000 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో ఏడుపాయల పుణ్యక్షేత్రం ఆరు రోజులుగా జలదిగ్బంధంలోనే ఉంది. గర్భగుడినీ మంజీరా ముంచెత్తింది. రాజగోపురంలో ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు- చేసి అమ్మవారి దర్శనాన్ని కల్పిస్తున్నారు. మంజీరా పరివాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఇన్ 39,009 క్యూసెక్కులు ఉండగా.. ఔట్ 43,466 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917 టీ-ఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.534 టీఎంసీలుగా నమోదైంది.




## యూరియా రాజకీయంపై తెలంగాణ ఎంపిల ఆందోళన

### పార్లమెంట్ ముందు నిరసన ప్రదర్శన

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19 :** తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటున్న యూరియా సమస్యను పరిష్కరించాలంటూ పార్లమెంట్ ఆవరణలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఆందోళనకు దిగారు. వారితోపాటు- కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ నిరసనలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతులపై వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన యూరియాను సరఫరా చేయకుండా తెలంగాణ రైతాంగాన్ని ఇబ్బంది పెడుతున్నారని ఎంపీలు మండిపడ్డారు. యూరియాను భాజపా పాలిత రాష్ట్రాలకు దారి మళ్లిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. యూరియా పంపిణీ విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీలు. మంగళవారం పార్లమెంటు ఆవరణలో యూరియా కొరతపై మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు యూరియా పంపుతూ.. తెలంగాణపై వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు ఎంపీలు మల్లురవి, గడ్డం వంశీకృష్ణ. తెలంగాణపై కేంద్ర వైఖరికి నిరసనగా పార్లమెంటు ఆవరణలో ఆందోళనకు దిగారు. తెలంగాణకు మొత్తం 9 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 3 నుంచి 4 లక్షల టన్నుల యూరియా మాత్రమే ఇచ్చినట్లు ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఫెర్టిలైజర్స్ పార్లమెంటరీ కమిటీ- ఛైర్మన్ క్రితీ ఆజాద్ ను సోమవారం ఎంపీలు అంతా కలిసి ఈ అంశంపై వివరించినట్లు- చెప్పారు. మంగళవారం జీరో అవర్ లో దీనిపై ప్రశ్నించనున్నట్లు- చెప్పారు. కూటమి ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు యూరియా పంపుతూ.. విపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలపై వివక్ష చూపిస్తున్నట్లు ఆరోపించారు.

# కేంద్రం యూరియా రాజకీయం!





యూరియా కొరత,సరఫరాపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. బిజెపినేతలు కూడా సమస్యను పరిష్కరించేందుకు సాయం చేయకుండా ఎదురుదాడి చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు పొలాలు వదిలి క్యూలో నిలబడి పోరాటం చేస్తున్నారు. చాలాకాలం తరవాత మళ్లీ యూరియా కోసం క్యూలు కడుతున్నారు. ఇది స్థానిక బిజెపి నేతలకు కనిపించక పోవడం దారుణం. సమస్యలను తెలుసుకుని వారధిగా నిలవాల్సిన స్థానిక బిజెపి నేతలు రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వీరు ప్రజలకోసం పాలిస్తున్నారా లేక,విపక్ష పార్టీలను వేధించేందుకు పాలిస్తున్నారా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంట్ వేదికగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోక పోవడం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగానే చూడాలి. యూరియా కోసం పార్లమెంట్ ఎదుట రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోని కేంద్రం తీరు క్షంతవ్యం కాదు. ఇది రైతులను మోసించడమే తప్ప మరోటి కాదు. వ్యవసాయరంగంపై సరైన అవగాహన లేని పాలకుల తీరుకారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. యూరియా ఎంత ఇచ్చాం..ఎంత అవసరం అన్నది కూడా తెలియకుండా విమర్శలతో కాలం గడిపితే నష్టపోయేది రైతులే అని తెలుసుకోవాలి. రైతులకు అసవరమైన ఎరువులు,పురుగుమందులు, విత్తనాల కోసం రోడ్డెక్కకుండా చూడడం ప్రథమం. ఇవి కూడా చేయకుండా కల్లబొల్లి కబుర్లతో కాలం గడిపస్తున్నారు. ప్రకృతి సేద్యం, సేంద్రియ సాగు, జీవ ఎరువుల ముసుగులో రాష్ట్రాల ఎరువుల కేటాయింపులకు కోతలు విధించిందని ఆరోపిస్తున్నారు. ఏటేటా ఐదు నుంచి పది శాతం ఎరువుల వినియోగం పెరుగుతున్నది. దీనిని తగ్గించడానికి ముందు కార్యాచరణ అవసరం. రైతుల్లో చైతన్యం తీసుకుని రావాలి. అలాగే రైతులకు అవసరమైన సేంద్రియ ఎరువులను సిద్దం చేయాలి. అలాగే సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని పెద్ద ఎత్తున చేపట్టాలి. ఇవేవీ చేయకుండా యూరియా కోటాను ఈ మేరకు కుదించడం సరికాదు. కేంద్రం కేటాయింపులు పెంచాల్సిందిపోయి కుదించడ టం సేద్యాన్ని, రైతులను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేయడమే కాగలదు. ఖరీఫ్ రైతుకు అదనకు అవసరమైన యూరియా పుట్టని దుస్థితి దాపురించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణం. మరోవైపు ఎరువులపై రైతులకు ఇచ్చే సబ్సిడీని భారంగా భావించిన కేంద్ర బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తూ వస్తోంది.

పర్యావరణం, ప్రజల ఆరోగ్యం కూడా ముఖ్యమే. ఇందుకు ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. కానీ అందుకు తగినకార్యాచర ఒకటి తయారు కావాలి. రైతులకు సేంద్రియ ఎరువులు అందుబాటులోకి తీసుకుని రావాలి. ఇవేవి చేయకుండా అమ్మకాలపై ఆంక్షలు పెట్టడం సరికాదు. గతేడాది పదిశాతం కేటాయింపులు తగ్గించిందని ఎపి రైతులు వాపోతున్నారు. ఆంధ్రా రాష్ట్రంలో నిరుడు 39 లక్షల టన్నుల అమ్మకాలు జరగ్గా 35 లక్షల టన్నులకు ఈ ఏడాది కేటాయింపులు కుదించబడ్డాయి. నాలుగు లక్షల టన్నులు తగ్గిపోయాయి. కేంద్రం ఎరువుల కేటాయింపులను తగ్గిస్తే మారు మాట్లాడకుండా కూటమి నేతలు భారాన్ని రైతులపైకి నెట్టేసారు. కేంద్ర మంత్రులు, ఎన్‌డిఎ ఎంపిలు ప్రధాని మోడీని మాటమాత్రం అడగడం లేదు. వ్యవసాయ రాష్ట్రాలైన తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌కు, ఇక్కడి రైతాంగానికి మోడీ ప్రభుత్వం అన్యాయం తలపెట్టినా కూటమి నేతలు, బిజెపి నేతలు, కేంద్రమంత్రులు చోద్యంచూస్తున్నారు. 2024 ఖరీఫ్‌లో ఎ.పి. యూరియా వినియోగం 6.32 లక్షల టన్నులు కాగా 2025లో 6.22 లక్షల టన్నులకు కేటాయింపు తగ్గింది. నెలనెలా కేటాయింపులు, వచ్చినది చూస్తే కోత ఇంకా ఎక్కువే. ఉదాహరణకు జులైలో 3.05 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 2.85 లక్షల టన్నులే వచ్చాయి. ఈ కోతలు ఒక వైపు కొనసాగుతుండగా, గతేడాది ఖరీఫ్‌లో ఎప్పటి కంటే నైరుతి రుతుపవనాలు ఈ మారు మే 26న రాష్ట్రంలోకి ప్రవేశించడంతో సీజన్ నెల రోజులు ముందుకొచ్చింది. రాయలసీమ, మరికొన్ని ప్రాంతాల్లో రైతులు ముందస్తుగా పంటలు సాగు చేయడంతో ఒక్కసారిగా యూరియాకు డిమాండ్ వచ్చింది. ధరలు, తెగుళ్లు, నీటి సదుపాయం ఇత్యాది కారణాలతో రైతులు పంటలను మారుస్తున్నారు. యూరియా డిమాండ్‌కు పంటల సరళిలో చోటు- చేసుకున్న మార్పులు కొంత వరకు కారణం. కేంద్రం కోతలను మేనేజ్ చేసే పనిలో వ్యవసాయశాఖ తలమునకలై ఈ పరిస్థితులను అంచనా వేయలేకపోయింది. ఇవన్నీ కలిసి ఖరీఫ్ రైతును ఎరువుల కోసం రోడ్డెక్కేలా చేన్నాయి.

ఎరువులు అందుబాటులో ఉన్నాయని కొరత లేదని ప్రభుత్వం ఎంతగా మభ్యపెట్టాలని ప్రయత్నించినా ఆ ప్రచారంలో నిజం లేదనడానికి పెద్ద పెద్ద క్యూలైన్లలో గంటల కొలది పడిగాపులు పడుతున్న అన్నదాత అవస్థలు కళ్లకుకడుతున్నాయి. సగం జిల్లాల్లో యూరియా, డిఎపి లభ్యత అవసరం కంటే తక్కువగా ఉందని ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల్లో పొంతన లేకుండా మాట్లాడుతోంది. మార్క్‌ఫెడ్ వద్ద బఫర్ స్టాక్ అంటున్నా ఎటు తరలుతున్నాయో తెలీదు. ఇదే అదనుగా ప్రైవేటు డీలర్లు బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారు. వేరే ఎరువుకు లింక్ పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వమే పెద్ద ఎత్తున నానో ఎరువులను అంటగట్టడంతో వాటిని వదిలించుకునేందుకు తంటాలు పడుతున్నారు. క్షణాల్లో సమాచారం అందించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాట్సాప్, రియల్ -టైం గవర్నెన్స్‌లు, డాష్ బోర్డులు రైతుల యూరియా కష్టాలను ఎందుకు పసిగట్టలేకపోతున్నాయో ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికే తెలియాలి. రైతులకు మేలు చేసే విధంగా వ్యవసాయశాఖతో పని చేయించాలి. తెలంగాణకు మొత్తం 9 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 3 నుంచి 4 లక్షల టన్నుల యూరియా మాత్రమే ఇచ్చినట్లు ఎంపిలు ఆరోపించారు. ఫెర్టిలైజర్స్ పార్లమెంటరీ కమిటీ- ఛైర్మన్ క్రితీ ఆజాద్‌ను సోమవారం ఎంపీలు అంతా కలిసి ఈ అంశంపై వివరించినట్లు- చెప్పారు. కూటమి ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు యూరియా పంపుతూ.. విపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలపై వివక్ష చూపిస్తున్నట్లు ఆరోపించారు.

# రాష్ట్రంలోని ప్రాజెక్టులకు జలకళ

- ప్రధాన జలాశయాల్లో గేట్లు ఎత్తివేత
- ప్రాజెక్టుల సందర్శనకు పర్యాటకులు రాక



**హైదరాబాద్, ఆగస్ట్ 19 :** తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, కాలువులు పొంగిపోర్లుతున్నాయి. దీంతో ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. ఈ మేరకు పలు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువ ప్రాంతాలకు నీటి విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాజెక్టుల వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఆ దృశ్యాన్ని చూడటానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్తున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం,జూరాల, తుంగభద్రససింగూరు వంటి ప్రాజెక్టులకు ప్రజలు తరలివస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి నీటి విలువ వివరాలను తాజాగా అధికారులు వెల్లడించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 39 గేట్లు- ఎత్తివేసినట్లు- అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుంచి దిగవ భాగానికి 1.51లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు- పేర్కొన్నారు. శ్రీశైలానికి 3.29 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని.. చెప్పారు. ఈ మేరకు శ్రీశైలంలో 10, సాగర్‌లో 26 గేట్లు ఎత్తినట్లు అధికారులు ప్రకటించారు. మంచిర్యాల ఎల్లంపల్లి ప్రాజెక్టు 35 గేట్లు ఎత్తి, లక్షా 83 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు- పేర్కొన్నారు. అలాగే నిర్మల్, కడెం ప్రాజెక్టు 2 గేట్లు- ఎత్తి, 16 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. మహబూబ్ నగర్ పరిధిలోని జూరాల ప్రస్తుత నీటిమట్టం 317.370 మీటర్లకు చేరుకుందని చెప్పుకొచ్చారు. పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లుగా ఉందని పేర్కొన్నారు. దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు వరద తగ్గినట్లు- తెలిపారు. ఒక గేట్ ఎత్తి 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు- వెల్లడించారు. నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నట్లు- అధికారులు తెలిపారు. ఈ మేరకు 8 గేట్లు- ఎత్తి దిగువకు 10,279 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు- చెప్పుకొచ్చారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 642.79 అడుగులుగా ఉందని, ప్రస్తుతానికి 642.79 అడుగుల నీటిమట్టానికి చేరుకుందని చెప్పారు. అలాగే.. పులిచింతల ప్రాజెక్టుకు కూడా భారీగా వరద ప్రవాహం ఉందని పేర్కొన్నారు. 14 గేట్లు ఎత్తి దిగువకు 4,18,092 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు వివరించారు. పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 167.485 అడుగులుగా ఉందని వెల్లడించారు. జిల్లాలోని మరో భారీ ప్రాజెక్టు అయిన నాగార్జున సాగర్‌కు భారీ వరద కొనసాగుతున్నట్లు- అధికారులు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో 26 గేట్లు- ఎత్తి దిగువకు 3,98,660 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు- వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామార్థం 312.0450 టీ-ఎంసీలుగా ఉంటే..ప్రస్తుతం 298.12 టీ-ఎంసీలకు చేరుకుందని స్పష్టం చేశారు. సంగారెడ్డి సింగూరు ప్రాజెక్టులోకి కూడా వరద కొనసాగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 29.917 టీ-ఎంసీలుగా ఉంటే.. ప్రస్తుతం 19.534 టీ-ఎంసీలుగా నీటి నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు. ఇకపోతే అధిక వర్షాల కారణంగా పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. ఎస్.ఆర్.ఎస్.పి ప్రాజెక్టు నుండి అధికంగా వరద నీరు రావటంతో ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో పెరిగింది. ఎస్.ఆర్.ఎస్.పి ప్రాజెక్టు నుండి అధికంగా 1,73,578 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టుకు వచ్చిచేరుతుంది. కడెం ప్రాజెక్టు నుండి 11 వేల క్యూసెక్కుల వరద నీరు, వర్షం ద్వారా 71 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇన్ ఎ÷-లో 2,55,707 క్యూసెక్కులు కాగా అధికారులు 35 గేట్లు- తెరిచి 3,46,846 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 16.7912 టీ-ఎంసీల నీరు నిల్వ ఉంది. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## మంగపేటలో 18.6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు

- పలుచోట్ల నీట మునిగిన పంట చేలు
- కల్వర్టులపై నుంచి పారుతున్న నీరు

**హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా వానలు దంచికొడుతున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల రోడ్లు, కల్వర్టులు తెగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట పొలాలు నీట మునగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాష్ట్రంలో అత్యధికంగా ములుగు జిల్లా మంగపేటలో 18.6 సెంటీ-మీటర్ల వర్షపాతం నమోదయింది. ఏటూరునాగారం 16.1, వెంకటాపురం (ములుగు)లో 12.1 సెం.మీ., జైనథ్ (ఆదిలాబాద్)లో 11.6, మల్లూరు (ములుగు)లో 11.6 సెం.మీ., వాంకిడి (ఆసిఫాబాద్)లో 11.3, సాత్నాల (ఆదిలాబాద్)లో 11, ములుగు జిల్లా తాడ్వాయిలో 10.4, కన్నాయిగూడెంలో 10.2, ధర్మవరంలో 10.2, మేడారంలో 10.2, ఆదిలాబాద్ జిల్లా సిరికొండ 9.7, రాంనగర్ 8.9, గుడిహత్నూరులో 8.9, జంబుగ (ఆసిఫాబాద్)లో 8.6 సెం.మీ., సర్వాయిపేట (భూపాలపల్లి) 8, ధనోరా (ఆసిఫాబాద్) 7.5, ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో 7.5, కెరమెరిలో 7.3, ఆదిలాబాద్ అర్బన్‌లో 7.1, బిక్నూర్ (కామారెడ్డి) 6.8, వాజేడు (ములుగు) 6.7, ఉట్నూరు (ఆదిలాబాద్) 6.5, సిర్పూర్ (టి) (ఆసిఫాబాద్) 6.4, ఇచ్చోడ 6.3, మెదక్ జిల్లా కాగజ్‌మద్దూరులో 6.2 సెంటీ-మీటర్ల చొప్పున వర్షపాతం నమోదయింది.

## ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణమ్మ పరుగులు

**పరివాహక ప్రాంత ప్రజలకు హెచ్చరిక జారీ**

**విజయవాడ, ఆగస్ట్ 19 :** ఎగువ నుంచి చేరుతోన్న వరద నీటి కారణంగా ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 3.25 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ఇది 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరవచ్చని అధికారులు భావిస్తున్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం కనిపిస్తోంది. కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చే అవకాశం ఉండడంతో.. ప్రభావిత జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణానది పరీవాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వాగులు.. కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో ప్రజలను హెచ్చరించారు. వాయుగుండం ప్రభావంతో గడచిన 24 గంటల్లో.. పాడేరులో 16 సెంమీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రమంతటా ఇవాళ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు, అలాగే కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. తీరం వెంబడి ఈదురు గాలులు కొనసాగుతాయని పేర్కొంది. వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం మంగళవారం మధ్యాహ్నానికి దక్షిణ ఒడిశా వద్ద తీరం దాటనుంది. ఈ క్రమంలో.. గడిచిన 24 గంటల్లో ఎపిలో కుండపోత వానలు కురిశాయి.

## ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి పోటీ

- ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- ఉదయం సమావేశమై ఖరారు చేసిన విపక్ష నేతలు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19 :** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీకి నిలపాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఈ మేరకు ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా తెలంగాణకు చెందిన విశ్రాంత జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి పేరును ఇండియా కూటమి మంగళవారం ఖరారు చేసింది. జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి.. గతంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు. 2007 నుంచి 2011 మధ్య సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి విధులు నిర్వహించారు. ఆ తర్వాత గోవా లోకాయుక్తగా సైతం ఆయన పని చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం గ్రామం. ఉప రాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవం చేయాలని మోదీ ప్రభుత్వంలోని పలువురు కేంద్ర మంత్రులు పిలుపునివ్వగా, ఇండియా కూటమి నీళ్లు చల్లింది. ఆ క్రమంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి పేరును తెరపైకి తీసుకువచ్చింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో దక్షిణాదికి ప్రాతినిధ్యం కల్పిస్తున్నట్లు సీపీ రాధాకృష్ణన్‌ను తమ అభ్యర్థిగా బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. ఇండియా కూటమి సైతం ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిగా దక్షిణాదికి చెందిన వ్యక్తినే ఎంపిక చేయాలని భావించింది. అందులోభాగంగా తెలంగాణకు చెందిన జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి పేరును ఎవరూ ఊహించని విధంగా తెరపైకి తీసుకు వచ్చింది. మంగళవారం న్యూఢిల్లీలో ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాల పార్టీల నేతలు సమావేశమయ్యారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలపాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు ఇండియా కూటమి నుంచి డీఎంకే ఎంపీ తిరుచ్చి శివను రంగంలోకి దింపుతారంటూ ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ అకస్మాతుగా రాజీనామా చేశారు. అనారోగ్య కారణంగానే తాను ఈ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు- ఆయన ప్రకటించారు. కానీ ఆయనకు ఇంకా రెండేళ్లకు పైగా పదవి కాలం ఉన్నప్పటికీ ఎందుకు రాజీనామా చేశారంటూ మోదీ ప్రభుత్వంపై ఇండియా కూటమిలోని పలు రాజకీయ పార్టీల నేతలు విమర్శలు సంధించారు. ఇక జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఆ పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఇక ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో దిగుతారంటూ.. పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. అయినా చివరకు ఆ పదవి ప్రస్తుత మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ వరించింది. దీంతో ఆయన ఉప రాష్ట్రపతి పదవికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. అయితే ప్రభుత్వంలో అత్యున్నత స్థాయి పదవులకు వివిధ రాష్ట్రాల గవర్నర్లను ఎన్డీయే ఎంపిక చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రాష్ట్రపతిగా ద్రౌపది ముర్మతోపాటు- ఇటీవల ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ దన్‌ఖన్ సైతం ఈ పదవి చేపట్టేముందు గవర్నర్‌గా విధులు నిర్వహించిన సంగతి తెలిసిందే. అలాగే సీపీ రాధాకృష్ణను సైతం మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఈ క్రమంలో దక్షిణ్యాదికే చెందిన మాజీ సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేయడం ద్వారా ఇండియా కూటమి అధికారెన్‌డిఎకు షాక్ ఇచ్చింది.

## డెంగ్యూతో యువకుడు మృతి

**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండలంలోని నాగారం గ్రామం లో డెంగ్యూతో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు నాగారం గ్రామానికి చెందిన మంగ మహేష్ (31) తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురి కాగా మండల కేంద్రంలో ప్రవేట్ హాస్పిటల్ లో చికిత్స అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం వెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. నాగారం గ్రామంలో డెంగుతో మృతి చెందగా ప్రజలంతా భయాందోళనలకు గురి అవుతున్నారు. వర్కట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని డాక్టర్ జ్యోతి, జిల్లా ప్రోగ్రాం అధికారిని సాయి శోభ, తాసిల్దార్ దశరథ నాగారం గ్రామంలో పర్యటించి ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురి కావద్దని సూచించారు. తక్షణ చర్యల్లో భాగంగా అధికారులు గ్రామంలో హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేశారు.



## నెహ్రూ భారత్‌ను రెండు సార్లు విభజించారు

**ప్రధాని నరేంద్ర మోదీ**

**న్యూఢిల్లీ :** మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ భారత దేశాన్ని రెండుసార్లు విభజించారని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఒకసారి రాడ్‌క్లిఫ్ లైన్‌తో విభజిస్తే.. భారత్‌కు చెందిన సింధూ నదిని ముక్కలు చేసి మరోసారి విభజించారన్నారు. దీనివల్ల దేశంలో వ్యవసాయానికి గణనీయమైన నష్టం వాటిల్లిందన్నారు. కొంత కాలానికి పాకిస్థాన్‌తో తాను చేసుకున్న సింధూ నది ఒప్పందం వల్ల 80 శాతం నీరు ఆ దేశానికి వెళ్లాయని.. భారత్‌కు మాత్రం ఎలాంటి ప్రయోజనం లేదనే విషయాన్ని నెహ్రూనే స్వయంగా అంగీకరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు వ్యతిరేకి అనే దానికి ఆయన తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమన్నారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును కాలరాసేందుకు నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మోదీ మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచేశారని ఆరోపించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, తమ ప్రభుత్వం అధికారం చేపట్టాకే వారి అభివృద్ధి మొదలయ్యిందని.. ఎన్డీఏ పాలనలో దేశం మూడో ఆర్థిక శక్తిగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోందన్నారు.



## 40 అంతస్తులంత జంబో రాకెట్ నిర్మిస్తున్నాం

**ఇస్రో ఛైర్మన్ నారాయణన్**

**న్యూఢిల్లీ :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో కీలక ముందడుగు వేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఏకంగా 40 అంతస్తుల భవనమంత భారీ రాకెట్ నిర్మించే పనిలో నిమగ్నమైనట్లు ఆ సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఏడాది నావిక్ ఉపగ్రహం, ఎన్1 రాకెట్ ప్రయోగం, అమెరికాకు చెందిన 6,500 కిలోల బరువైన కమ్యునికేషన్ శాటిలైట్‌ను కక్ష్యలోకి చేర్చడం వంటి ప్రాజెక్టులు చేపట్టనుందన్నారు. "మీకు తెలుసా.. అబ్దుల్ కలామ్ జీ తయారు చేసిన తొలిరాకెట్ 17 టన్నుల లిఫ్ట్‌ఆఫ్ బరువుతో.. 35 కిలోల ఉపగ్రహాన్ని దిగువ భూకక్ష్యకు చేర్చింది. కానీ, నేడు 75,000 కిలోల బరువైన పేలోడ్‌ను దిగువ భూకక్ష్యకు చేర్చడంపై పనిచేస్తున్నాం. అందుకు అవసరమైన రాకెట్ 40 అంతస్తుల భవనం అంత ఎత్తు ఉంటుంది" అని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌కు కక్ష్యలో 55 ఉపగ్రహాలు ఉన్నాయని చెప్పారు. వచ్చే మూడు లేదా నాలుగేళ్లలో వీటి సంఖ్య మూడు లేదా నాలుగు రెట్లు పెరగనుందన్నారు. ఇస్రో ప్రస్తుతం టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ శాటిలైట్ (టీడీఎస్), నౌకాదళం కోసం సిద్ధం చేసిన జీశాట్-7ఆర్ ప్రయోగించనుంది. ఇది ఇప్పటికే కక్ష్యలో ఉన్న జీశాట్-7 (రుక్మిణి) స్థానాన్ని భర్తీ చేయనుంది. ఉస్మానియాలో జరిగిన స్నాతకోత్సవంలో నారాయణన్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. భారత అంతరిక్ష కార్యక్రమానికి ఆయన చేసిన సేవలకుగాను ఈ పురస్కారం లభించింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా దీనిని అందుకొన్నారు.



## మరాఠా యోధుడి ఖడ్గం సేకరణ

**ముంబయి, ఆగస్ట్ 19 :** 17-18 శతాబ్దాల మధ్యకాలంలో మరాఠా సామ్రాజ్యాన్ని దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించిన యోధుడు ఒకటో రఘుజి భోంస్లేకి చెందిన ఖడ్గాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. లండన్‌లో జరిగిన ఒక వేలంపాటలో చేజిక్కించుకున్న ఈ ఖడ్గాన్ని ముంబయికి తీసుకొచ్చారు. ఇది దేశ వారసత్వ సంపదను పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన చర్య అని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. ఖడ్గాన్ని పి.ఎల్.దేశ్‌పాండే అకాడమీలో భద్రపరిచామని, సాంస్కృతిక శాఖ మంత్రి అశీశ్ షెలార్ అన్నారు. ఈ ఖడ్గాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లేందుకు ఒక బైక్ ర్యాలీ నిర్వహించాలని ముందు నిర్ణయించారు కానీ భారీ వర్షాల కారణంగా దాన్ని రద్దు చేశారు. ఛత్రపతి షాహు మహారాజ్‌కు సేనాపతిగా పనిచేసిన రఘుజీ భోంస్లే నాగ్‌పుర్ సామ్రాజ్య స్థాపకునిగా ప్రసిద్ధుడు. ఆయన మరాఠా సామ్రాజ్యాన్ని బెంగాల్, ఒడిశా తదితర ప్రాంతాలకు విస్తరించారు.



# జర్నలిస్టుల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించాలి

## టీజేయు జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్

**యాదాద్రి భువనగిరి జిల్లా రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించి,ఆదుకోవాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా అన్నారు. ఎస్వీ కాన్ఫరెన్స్ ఏర్పాటుసమావేశంలో అయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించి ఆదుకోవాలని అన్నారు.సరైన సమయంలో వైద్యం అందక జర్నలిస్టులు మృతిచెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు కల్పించిన హెల్త్ కార్డు అన్ని కార్పొరేట్ హాస్పిటల్లో చెల్లుబాటు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కురుస్తున్న భారీ వర్షాలకు జర్నలిస్టులు వార్త సేకరణలో భాగంగా పలు జాగ్రత్తలు తీసుకొని వార్తా సేకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా ప్రచార కార్యదర్శి సిరిల్ రాష్ట్ర నాయకులు సుక్క అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు రషీద్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.



### ఈత చెట్ల పెంపకంతో

# కల్లు గీత కార్మికులకు ఉపాధి

## అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఇబ్రహీంపల్లి వార్డులో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రైతు రవీందర్ గౌడ్ పొలంలో 500లకు పైగా ఈత, ఖర్జూర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... నాటిన ఈత మొక్కలను భాద్యతగా సంరక్షించుకోవాలని సూచించారు. ఈత, ఖర్జూర మొక్కలతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు.ఈ కార్యక్రమంలో.. ఆబ్కారి సిఐ శ్రీలత, ఎస్ఐలు ఖాజా మోయినుద్దీన్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, చేవెళ్ల సహకార సంఘం డైరెక్టర్ పైండ్ల మధుసూదన్ రెడ్డి, నాయకులు దర్శన్, వెంకట్ రెడ్డి, మల్లేష్, ఖలీమ్, సత్యనారాయణ, జంగయ్య, కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# బురదమయంగా రెడ్డి కాలనీ రోడ్డు

- ఏళ్ళు గడుస్తున్న మారని రోడ్ల పరిస్థితి
- మున్సిపల్ శాఖ పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** పేరుకేమో మహానగరమైన హైదరాబాద్ కి అతి చేరువలో ఉన్న మున్సిపాలిటీ. మౌలిక సదుపాయాలలో మాత్రం పరిస్థితి వెనుక బాటు. ఇది శంకర్ పల్లి మున్సిపల్ అధికారుల పనితీరుకు నిదర్శనం అని చెప్పవచ్చు. శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్ రోడ్డు పక్కన గల రెడ్డి కాలనీ రోడ్డు వర్షానికి బురదతో నిండి చిత్తడిగా మారింది. రోడ్డంతా గుంతలుగా ఏర్పడి బురదగా మారడంతో అపార్ట్మెంట్ వాసులు, స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. కాలనీకి వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు, మహిళలకు ఇక్కట్లు తప్పడం లేదు. నిత్యావసర వస్తువులు తీసుకురావడానికి బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు కూడా నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం కొనసాగిస్తున్నారు. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ నరకకూపంగా మారుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, నాయకులు స్పందించి, వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి సమస్యను తీర్చాలని కాలనీ వాసులు మొర పెట్టుకుంటున్నారు.




# ఉత్తమ ఫోటోగ్రాఫర్‌గా మదూరి బ్రహ్మాచారి

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఫోటో గ్రాఫర్ గా సూర్యాపేట ఆంధ్రప్రభ ఫోటో గ్రాఫర్ మదూరి బ్రహ్మాచారి రాష్టంలో మొదటి బహుమతి అందుకున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,పౌర సంబంధాల శాఖ హైద్రాబాద్ వారు ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన నాల్గవ కేటగిరీ రాజీవ్ యువ వికాసం విభాగంలో రాష్ట్రంలో మొదటి బహుమతిని సాధించటంతో మంగళవారం హైద్రాబాద్ గ్రీన్ పార్కు హెూటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు,ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంకల చేతుల మీదుగా నగదు పురస్కారంతో పాటు శాలువ, షీల్డ్, ప్రసంసా పత్రంతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

## ఫొటోగ్రఫీ జండా ఆవిష్కరణ చేసిన మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో సూర్యాపేట పట్టణ అధ్యక్షులు కొక్కుల శేఖర్ అధ్యక్షతన 186 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా సూర్యాపేట పట్టణ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్ హాజరై ఫోటోగ్రఫీ జండా ఆవిష్కరణ చేశారు వారు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లందరూ ఐక్యమత్యంగా ఉండాలని అసోసియేషన్ సంఘటితంగా ముందుకు పోవాలని ఫోటోగ్రాఫర్లకు ఎలాంటి సమస్య వచ్చినా సంఘం ద్వారా పరిష్కరించుకోవాలని 1000 మాటల కన్నా ఒక ఫోటో మిన్న చరిత్రను చూపించేది ఫోటో, కాలగర్భంలో కలిసిపోతున్న చరిత్రను చూపించే సజీవ సాక్ష్యము ఫోటో,ఇలాంటి ఫోటోగ్రఫీ రాను రాను ఈ సెల్ ఫోన్లు వచ్చిన తర్వాత చాలా వృత్తిలో రాణించలేకపోతున్నారు ఫోటోగ్రఫీ రంగంలో ఉన్నవారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అర్హులైన ఫోటోగ్రాఫర్లకు సబ్సిడీ లోన్స్ అర్హులైన వారికి డబల్ బెడ్ రూమ్స్ రాత్రనకా పగలనకా ఫోటోగ్రఫీ కార్యక్రమంలో పాల్గొన్న ఫోటోగ్రాఫర్లకు స్పెషల్ డ్రైవ్ గా ఫోటోగ్రఫీ కుటుంబాలకి ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వం అందించాలని ఫోటోగ్రఫీ భవనం కట్టించాలని రాపర్తి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడడం జరిగినది ,అనంతరం కాసర బాధ రోడ్డులో అపూర్వ బాదిరుల స్కూల్లో పిల్లలకు పండ్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగినది కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కూకుంట్ల శంకర్, కోశాధికారి రాపర్తి మహేష్ గౌడ్, కొచ్చర్ల రవి,ఆర్ఆర్ ల్యాబ్ శేఖర్ ,సాయిరెడ్డి ,మల్లికార్జున్,సిద్ధి శ్రీకాంత్, మిక్సింగ్ నజీర్,మిక్సింగ్ ఓంకార్ దుర్గ,మధు, మీడియా మధు,మిక్సింగ్ పాషా,మిక్సింగ్ ఓంకార్ నాగార్జున సంపత్, ఉపేందర్ సురేష ప్రభు భరత్ మోహన్ అశోక్ రాజు,వీరబాబు, రాజేష్ పాల్గొన్నారు.

# రైతుకు శ్రమ లేకుండా చేసేందుకే అధునాతన ప్యాడి క్లీనర్స్

## వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** రైతులకు శ్రమ లేకుండా చెత్త చెదారం తాలు తీసివేసి ధాన్యం పరిశుభ్రం చేసేలా అధునాతన ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ల ను ఐకేపీ కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్లో రైతులు, అధికారుల సమక్షంలో ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్ ల పనితీరును డెమో ద్వారా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అధునాతన ప్యాడి క్లీనర్స్ ఏర్పాటు చేసేటప్పుడు చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగా సూర్యాపేట జిల్లాలో 116 ఐకెపి సెంటర్లకు ప్రస్తుతం 300 ప్యాడి క్లీనర్స్ పాతవి ఉన్నాయని వాటికి తోడుగా అధునాతన ప్యాడి క్లీనర్స్ ను 60 తెస్తున్నట్లు తెలిపారు.పాత ప్యాడే క్లీనర్లను కూడా 60 వేల ఖర్చుతో అధునాతనంగా మార్చే అవకాశం ఉందని ఆ దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు తేమ లేకుండా తీసుకొచ్చిన ఈ మిషన్ల ద్వారా శుభ్రం చేసి రైతుకు మంచి ధర అందించడం జరుగుతుందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.రైతు ప్రయోజనాల కోసం అందజేస్తున్న ప్యాడి క్లీనర్స్ ఏర్పాటులో మార్కెట్ కమిటీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఆయన వెంట డి.ఎస్.ఓ మోహన్ బాబు,డి ఎం ఓ సంతోష్, మార్కెట్ సెక్రటరీ ఫసియోద్దీన్, యుడిసి ఖాసిం,రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు బోనాల రవీందర్, కక్కిరెని చంద్రశేఖర్ మార్కెట్ డైరెక్టర్లు ఆర్తి కేశవులు,పచ్చిపాల వెంకన్న,అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమతంగా ఉండాలి

## - జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి మంగళవారం కస్లాబాద్ చెరువు (నందివాగు ప్రాజెక్టు) వద్ద ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా చెరువులో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో, ఎస్పీ స్వయంగా చెరువు కట్టను, ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భనలో ఎస్పీ అక్కడి పరిస్థితులపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, ఆయన కొన్ని కీలక సూచనలు జారీ చేశారు. అనవసర ప్రయాణాలు మానుకోండి: చెరువు పరిసర ప్రాంతాలకు అవసరం లేని పక్షంలో ప్రజలు వెళ్లకూడదు. అపరిచితులు, పర్యాటకులు ఈ ప్రాంతానికి దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలు, వృద్ధుల భద్రత ముఖ్యమని చెరువులో నీటి మట్టం పెరిగినందున తల్లిదండ్రులు తమ పిల్లలను, వృద్ధులను చెరువు దగ్గరికి వెళ్లనివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాత్రి వేళల్లో కార్యకలాపాలు వద్దని మత్స్యకారులు రాత్రి వేళల్లో చెరువు దగ్గర కార్యకలాపాలు చేయకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రమాదాల గురించి సమాచారం ఇవ్వాలని, చెరువుల వద్ద ఎటువంటి ప్రమాదకర పరిస్థితులను గమనించినా వెంటనే డయల్ 100 లేదా సమీపంలోని పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తద్వారా తక్షణ సహాయక చర్యలు చేపట్టవచ్చని ఎస్పీ తెలిపారు. నిరంతర గస్తీ ప్రజలకు తక్షణ సహాయం అందించడానికి చెరువు వద్ద క్రమం తప్పకుండా పోలీసు గస్తీ బలగాలు అందుబాటులో ఉంచాలని ఎస్పీ పోలీసు అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వికారాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మోమిన్‌పేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. వెంకట్ పాల్గొన్నారు.

### ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మద, ఫాసిస్టు విధానాలకు

# వ్యతిరేకంగా పోరాడుదాం

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తప్పట్ల స్కైలాబ్ బాబు పిలుపు




**భువనగిరి రాజముద్ర న్యూస్:** ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం, లౌకికత్వం, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుదామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తప్పట్ల స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి పట్టణంలోని జి.బి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో సిపిఎం పోచంపల్లి, బీబీనగర్ మండలాల పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతుల్లో రెండవ రోజు క్లాసు బోధించడానికి విచ్చేసిన స్కైలాబ్ బాబు మాట్లాడుతూ కేంద్రం లోని మోడీ మతోన్మాద ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ పదకొండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల మీద దాడులు చేస్తూ ఇదేమని ప్రశ్నించిన ప్రతి ఒక్కరి పైన నిర్బంధాలను ప్రయోగిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను, అడవులను తన అనియాయులైన అంబానీ, అదానీలకు, కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన ప్రజాస్వామ్యం, సామ్యవాదం, లౌకిక తత్వం, స్వేచ్ఛ లాంటి వాటిని తొలగించి తన మనువాద ఎజెండను ప్రవేశపెట్టాలని చూస్తున్నారని అన్నారు. మోడీ పాలనలో విద్య, వైద్యం, ఉపాధి సామాన్య మానవునికి అందే పరిస్థితి లేదని అన్నారు. మరోపక్క నిత్యవసర వస్తువుల ధరలు పెంచడంతో పేదలు రెండుపూటల తిండి తినే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.దేశ సమైక్యత, సమగ్రత కోసం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా,కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని స్కైలాబు బాబు పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాలను అన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా పెన్షన్ దారులు నూతన పెన్షన్లు ఇవ్వకపోవడం, పెంచి ఇస్తానన్న డబ్బులు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారికి వెంటనే ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని అన్నారు.గ్రామాలలో పాలకవర్గం లేకపోవడంతో గ్రామాల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయని అన్నారు.ప్రజలు తమకు ఉన్న సమస్యలను ఎవరికి చెప్పాలో అర్థం కాని పరిస్థితి ఉన్నదని అన్నారు.గ్రామాలలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఈనెల 20 నుండి 25 వరకు గ్రామాలలో సిపిఎం ఆధ్వర్యంలో పర్యటనలు చేసి గ్రామపంచాయతీల ముందు ఆందోళన చేపడతామని, 28 నుంచి 30 వ తేదీ వరకు తహశీల్దార్ కార్యాలయాల ముందు దీక్షలు, ధర్నాలు నిర్వహిస్తామని ఈ కార్యక్రమాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ పిలుపునిచ్చారు. ఈ రెండు రోజుల క్లాసులకు ప్రిన్సిపల్ గా సిపిఎం పోచంపల్లి పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, కోట రామచంద్రారెడ్డి , మాజీ జిల్లా కమిటీ సభ్యులు సభ్యులు పగిళ్ల లింగారెడ్డి, బీబీనగర్ మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, పోచంపల్లి, బీబీనగర్ మండలాల కార్యదర్శి వర్గసభ్యులు మంచాల మధు, ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డి, అందెల జ్యోతి, యస్.డి ఉమర్ పోచంపల్లి పట్టణ , మండల, బీబీనగర్ మండల కమిటీ సభ్యులు వడ్డేపల్లి యాదగిరి, నోముల కృష్ణారెడ్డి, నెలికంటి జంగయ్య, పత్తి బిక్షపతి, కోటా అశోక్, బుగ్గ లక్ష్మయ్య, పోన్నమోని కృష్ణ, బోయపల్లి పుష్పలత, గూడూరు రాంమిరెడ్డి, సామ జంగారెడ్డి, గూడూరు కృష్ణారెడ్డి, బేతి కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

### గణేష్ నవరాత్రి ఉత్సవాలలో

# జాగ్రత్తలు పాటించండి

- ఎత్తైన గణేష్ విగ్రహాలు తరలించే సమయంలో కరెంటు తీగల నుండి జాగ్రత్తలు పాటించాలి
- సూర్యాపేట ఎస్పి కె.నరసింహ



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** ఎత్తైన గణేష్ విగ్రహం పెడుతున్నాము,ఉత్సాహం విషాదం కావద్దు ,అశ్రద్ధగా ఉండొద్దు,ఎత్తైన గణేష్ విగ్రహాలను వాహనాలలో తరలించే సమయంలో కరెంటు తీగలు గమనిస్తూ వెళ్ళాలి అని తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎత్తయిన గణేష్ విగ్రహాలను తరలించే సమయంలో కరెంటు తీగలు తగిలి ప్రమాదాలు సంభవించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు.ఎవ్వరూ ప్రమాదాల బారిన పడవద్దు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ఉత్సవం సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఎత్తైన విగ్రహాలు తరలించే విషయాన్ని స్థానిక పోలీసులకు, ఎలక్ట్రిసిటీ అధికారులకు తెలియజేయాలని తద్వారా ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు.ముఖ్యంగా యువత సమన్వయంగా ఉండాలని అతి విషయాలకు వెళ్లొద్దు అని గొడవలు పెట్టుకోవద్దు అని కోరారు.



### చేపల వేటకై వెళ్లి గల్లంతయిన

# యువకుని మృతదేహం లభ్యం

**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండలంలోని వెలువర్తి గ్రామం చెరువు అలుగు వరదలో చేపల వేటకై వెళ్లి వరదకు కొట్టుకుపోయి మృత్యువాత పడిన శివరాత్రి నవీన్ మృతదేహం ఎట్టకేలకు లభ్యమైనది. సోమవారం సాయంత్రం వరదలో కొట్టుకుపోయిన నవీన్ కోసం దాదాపు 15 గంటల పాటు సెర్చ్ ఆపరేషన్ కొనసాగింది. నవీన్ మృతదేహం వరదలో పడిన చోటు నుండి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో చెట్ల పొదల్లో లభ్యమయింది. మృతదేహాన్ని గ్రామస్తులు, పోలీస్, రెవెన్యూ, ఎస్డిఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది బయటకు తీసుకువచ్చారు. మృతదేహం కోసం స్థానిక ఎస్సై యుగంధర్ గౌడ్, తహసిల్దార్ దశరథ 15 గంటలపాటు రాత్రి నుండి తెల్లవారి వరకు నిరంతర పర్యవేక్షణతో ఎస్డిఆర్ఎఫ్, ఫైర్, గ్రామస్తుల సమన్వయం, సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసుకు వచ్చినందుకు వారిని ప్రజలు అభినందించారు.



# రైతులకు అందుబాటులో యూరియా

## -జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**వలిగొండ, రాజముద్ర న్యూస్:** రైతులు యూరియా విషయంలో ఎవరు ఆందోళన చెందవద్దని,యాదాద్రి భువనగిరి జిల్లాలో యూరియా కొరత లేదని ప్రస్తుత సీజన్ సజావుగా సాగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని ఆగ్రోస్ ఫర్టిలైజర్ షాప్ ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరం కంటే యూరియా నిల్వలు ఎక్కువగా వచ్చాయని 15 వేల మెట్రిక్ టన్నులు రావడం జరిగిందని మరో 1000 మెట్రిక్ టన్నులు వస్తుందని రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులతో ఫెర్టిలైజర్ షాప్ యజమానులు ఫ్రెండ్లీగా ఉండాలని ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువగా అమ్మవద్దని అన్నారు. రైతులకు కావలసిన ప్రోడక్టు మాత్రమే ఇవ్వాలని ఇతర ప్రోడక్ట్ కొంటేనే యూరియా ఇస్తామని సూచించవద్దని అటువంటిది తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు గొల్లెపల్లి గ్రామానికి చెందిన రైతు భాస్కర్ రెడ్డితో యూరియా ఎంత కొనుగోలు చేయడం జరిగిందని తనకు ఎంత భూమి ఉందని అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దశరథ, మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి, ఎంఆర్ఐ కరుణాకర్ రెడ్డి, ఏఈఓ సాయి తదితరులు పాల్గొన్నారు.



# కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

## మక్తా గ్రామస్తులు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల మియాపూర్ డివిజన్ పరిధిలోనీ మక్త మహబూబ్ పేట్ గ్రామ శివారులో గల మిదికుంట చెరువు కట్ట మైసమ్మ ఆలయాన్నీ అభివృద్ధి చేస్తామని మక్త గ్రామస్థులు సమావేశం ఏర్పాటు చేసి ఏకమై ముక్త కంఠం తో తెలిపారు. మంగళవారం రోజు గ్రామస్థులందరూ కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. త్వరలో ఆలయ అభివృద్ధి కమిటీనీ ఏర్పాటు చేసి, కమిటీ ద్వారా సమష్టి నిర్ణయాలు తీసుకొని ఆలయ అభివృద్ధితో పాటుగా మన సంస్కృతి, సంప్రదాయ పండుగలు నిర్వహిస్తూ, భక్తులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## రిషి సునాక్‌కు హత్య బెదిరింపులు

### యువకుడికి జైలుశిక్ష



**బ్రిటన్ :** బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్‌పై జాత్యాహంకార బెదిరింపులకు పాల్పడిన ఓ 21 ఏళ్ల యువకుడికి స్థానిక కోర్టు జైలుశిక్ష విధించింది. ఈ రోజుల్లో ఇలాంటి వివక్షతకు ఎక్కడా చోటు లేదని స్పష్టం చేసింది. క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కన్‌హెడ్‌కు చెందిన లియామ్ షా గతేడాది జూన్‌లో రిషి సునాక్‌కు జాత్యాహంకార హత్యా బెదిరిం పులతో కూడిన రెండు ఈమెయిళ్లు పంపాడు. ఆ సమయంలో సునాక్ బ్రిటన్ ప్రధానిగా ఉన్నారు. ఆయన వ్యక్తిగత సహాయకుడు వాటిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే సెప్టెంబరులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ క్రమంలో.. మెయిళ్లు పంపినట్లు తనకు గుర్తే లేదని, ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్నట్లు అతడు పేర్కొన్నాడు. అయితే, గత నెల కోర్టు ముందు హాజరైన సందర్భంలో తన నేరాన్ని అంగీకరించాడు. ఈ క్రమంలోనే గత బుధవారం కోర్టు అతడికి 14 వారాల జైలుశిక్ష విధించింది. 20 రోజులు పునరావాస కేంద్రంలో గడపాలని, మాదకద్రవ్యాల రిహాబిలిటేషన్ కోర్సును కూడా పూర్తి చేయాలని ఆదేశించింది. అదేవిధంగా రెండేళ్లపాటు రిషి సునాక్‌కు, ఆయన కార్యాలయానికి దూరంగా ఉండాలని పేర్కొంది. "ప్రజాప్రతినిధితో నేరుగా సంప్రదించే సౌకర్యమనేది ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటిది. దాన్ని దుర్వినియోగం చేయడం.. ప్రజాస్వామ్య ప్రక్రియ కు హాని కలిగిస్తుంది" అని కోర్టు తన తీర్పు సమయంలో వ్యాఖ్యానించింది. అయితే, జైలుశిక్ష అమలును ఏడాది కాలానికి నిలిపేసింది.



## యూకేలో ఇద్దరు వ్యక్తులపై జాత్యహంకార దాడి..

**యూకే:** యూకేలో ఇద్దరు వ్యక్తులపై జాత్యహంకార దాడి ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడులకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. శిరోమణి అకాలీదళ్‌కు నాయకత్వం వహిస్తున్న సుఖ్‌బీర్ సింగ్ బాదల్ తెలిపిన వివరాల ప్రకారం.. యూకేలోని వోల్వర్‌హాంప్టన్ రైల్వేస్టేషన్ వద్ద ఈనెల 15న ఈ ఘటన జరిగింది. ఇద్దరు సిక్కు వ్యక్తులపై ముగ్గురు యువకులు దాడి చేశారు. ఈ జాత్యహంకార దాడిని తాను పూర్తిగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా యూకేలోని సిక్కు ప్రవాసుల భద్రత గురించి అధికార ప్రభుత్వం వద్ద లేవనెత్తాలని విదేశాంగ మంత్రి జైశంకర్‌ను ఆయన కోరారు. బాధితులకు న్యాయం చేయాలని అక్కడి పోలీసులను అభ్యర్థించారు. ఇలాంటి ప్రవర్తనను సహించేది లేదని పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నామని, దీనిపై విచారణ కొనసాగుతుందన్నారు. అయితే, ఆ తర్వాత బెయిల్‌పై నిందితులు విడుదలైనట్లు తెలుస్తోంది. యూకే ఎంపీ సురీనా బ్రాకెన్‌రిడ్జ్ కూడా ఈ దాడిని ఖండించారు. ఘటనకు సంబంధించిన నివేదికలను తనకు అందజేయాలని పోలీసులను ఆదేశించారు. ఈసందర్భంగా వోల్వర్‌హాంప్టన్‌లోని ప్రజలంతా ఐక్యంగా ఉండాలని ఎంపీ పిలుపునిచ్చారు.



## ఒక ఇజ్రాయెలీని చంపితే.. 50 మంది పాలస్తీనియన్లు చావాలి

### మాజీ అధికారి ఆడియో లీక్

**ఇజ్రాయెల్ :** ఇజ్రాయెల్– హమాస్‌ల మధ్య ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈక్రమంలో పాలస్తీనియన్లపై ప్రతీకారం తీర్చుకోవాలంటూ ఇజ్రాయెల్ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ అహరోన్ హాలీవా మాట్లాడిన ఆడియో ఒకటి బయటకొచ్చింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఓ న్యూస్ ఛానెల్ దీన్ని ప్రసారం చేయడం గమనార్హం. ఆడియో ప్రకారం.. అక్టోబరు 7 నాటి హమాస్ దాడులను ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడారు. నాటి దాడుల్లో ఒక ఇజ్రాయెలీ చనిపోతే.. దానికి బదులుగా 50 మంది పాలస్తీనియన్లను చంపేయాలని హాలీవా వ్యాఖ్యానించారు. వారు చిన్నారులైనా పర్వాలేదన్నారు. గాజాలో 50వేల మందికి పైగా చంపేయడం అవసరం అని ఆయన పేర్కొన్నారు. గాజాలో అమాయకులు ఎవరూ లేరంటూ.. ఆ ప్రాంతం మొత్తాన్ని విధ్వంసం చేయాలన్నారు. అయితే, హాలీవా ఈ వ్యాఖ్యలు ఎవరితో అన్నారనే విషయాన్ని ఆ వార్తా సంస్థ వెల్లడించలేదు. అక్టోబరు 7నాటి హమాస్ దాడుల్లో టెల్‌అవీవ్‌లో 1200 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరో 250 మందిని మిలిటెంట్ సంస్థ బందీలుగా తీసుకెళ్లింది. నాటి దాడుల సమయంలో ఇజ్రాయెల్ మిలిటరీ నిఘా విభాగం అధిపతి మేజర్ జనరల్‌గా అహరోన్ హాలీవా ఉన్నారు. హమాస్ కదలికలను అంచనా వేయడంలో ఇంటెలిజెన్స్ విఫలమైంది. దీనికి బాధ్యత వహిస్తూ హాలీవా గతేడాది ఏప్రిల్‌లో రాజీనామా చేశారు. కాగా.. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 61,700 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది. మరోవైపు ఇజ్రాయెల్ భీకర దాడులతో గాజాలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడి ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు.

# అమెరికాలో 6,000 మందికి విద్యార్థి వీసాలు రద్దు

### అమెరికా విదేశాంగశాఖ వెల్లడి



**యూఎస్ :** అమెరికాలో నిబంధనలు ఉల్లంఘించిన విద్యార్థుల పై కఠిన చర్యలు తీసుకొంటున్నారు. తాజాగా 6,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్లు బీబీసీ రిపోర్టులో పేర్కొంది. అమెరికా విదేశాంగశాఖ ఈవిషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. 4,000 మంది దేశ చట్టాలు ఉల్లంఘించడం, దాడులు, మత్తులో డ్రైవింగ్, దోపిడీలకు పాల్పడటం వంటివి చేసినట్లు తెలుస్తోంది. అమెరికా చట్టాల్లోని ఐఎన్ఏ 3బీ కింద ఉగ్రవాదానికి పాల్పడిన దాదాపు 300 మంది కూడా ఈ జాబితాలో ఉన్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభంలో ఈ వీసాల రద్దు వ్యవహారం వెలుగులోకి రావడం గమనార్హం. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక దేశంలో ఉన్నత విద్యావ్యవస్థను పునర్ వ్యవస్థీకరించే పనిలో పడ్డారు. ప్రధాన విశ్వవిద్యాలయాలను లక్ష్యంగా చేసుకొని తీవ్రస్థాయిలో పాలసీల మార్పులు చేపట్టారు. ఇవి అంతర్జాతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. తొలుత జనవరిలో యాంటీసెమిటిజమ్‌ను (యూదులపై వ్యతిరేకత) అరికట్టేలా బిల్లును పాస్ చేశారు. అంతర్జాతీయ విద్యార్థులు పాలస్తీనాకు మద్దతుగా ఆందోళనలు చేపడితే ఈ ఆదేశాల ప్రకారం వారిని దేశ బహిష్కరణ చేయవచ్చు. విదేశీ విద్యార్థులకు కొత్త ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను నిలిపివేస్తూ జూన్‌లో ట్రంప్ కార్యవర్గం నిర్ణయం తీసుకొంది. అనంతరం సోషల్ మీడియా వెట్టింగ్‌ను కఠినతరం చేశారు. ఫారెన్ స్టూడెంట్స్ కచ్చితంగా వారి సామాజిక మాధ్యమ ఖాతాలు బహిర్గతం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల పోస్టులు, కామెంట్లు, లైక్‌లను అమెరికా అధికారులు పరిశీలించి.. వారు జాతీయ భద్రతకు ముప్పు కాదు అని భావిస్తే మాత్రమే వీసా ప్రక్రియలో ముందుకువెళతారు. ఇక కీలక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు కేటాయించిన నిధు ల్లో కోత విధించారు. క్యాంపస్‌ల్లో పాలస్తీనా అనుకూల ఆందో ళనల్లో పాల్గొన్న చాలామంది విదేశీ విద్యార్థులను అరెస్టు చేయించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థులను నియమించుకోకుండా బ్లాక్ చేశారు. ఈక్రమంలో ట్రంప్ కార్యవర్గం, విశ్వవిద్యాలయం మధ్య న్యాయపోరాటం మొదలైంది. గతేడాది గణాంకాల ప్రకారం దాదాపు 10 లక్షల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాలో చదువు తున్నారు. వారి నుంచి దాదాపు 43.8 బిలియన్ డాలర్లు అమెరికాకు లభించాయని ఎన్ఏఎఫ్ఎస్ఏ అసోసియేషన్ వెల్లడించింది. దేశంలోని మొత్తం విద్యార్థుల్లో వీరు 6 శాతం వరకు ఉంటారు.


## ఆ రెస్టారెంట్‌లో ఫుడ్ వేస్ట్ చేస్తే.. ఫైన్ కట్టాల్సిందే




**పుణె :** ఆహార వృథాను అరికట్టేందుకు ఓ హోటల్ వినూత్న నిర్ణయం తీసుకుంది. ఎవరైనా ఆహారాన్ని వృథా చేస్తే.. రూ.20 అదనంగా చెల్లించాలనే నిబంధనను ప్రవేశపెట్టింది. వేస్ట్ చేసిన ఫుడ్‌కి ఫైన్ చెల్లించాలంటూ చేతితో రాసిన ఆ రెస్టారంట్ మెనూ బోర్డ్ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్ర పుణెలోని ఓ రెస్టారంట్ తమవద్ద ఎవరైనా ఆహారాన్ని వృథా చేస్తే.. రూ.20 చెల్లించాల నే నిబంధనను ప్రవేశపెట్టింది. దీనికి సంబంధించిన మెనూను ఓ నెటిజన్ 'ఎక్స్'లో పోస్టు చేస్తూ.. "పుణెలోని ఓ హోటల్ వృథా ఆహారానికి రూ.20 ఛార్జీ వసూలు చేస్తోంది. ప్రతి రెస్టారంట్, పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాల్లో ఇలాంటి నిబంధన పెడితే కొంత వరకైనా ఆహార వృథాని అరికట్టవచ్చు" అని రాసుకొచ్చాడు. ఆహార వృథాని నివారించడానికి ఇదో ముంద డుగు లాంటి చర్య అని పలువురు నెటిజన్లు పేర్కొన్నారు. ఆహారం వృథా కాకూడదనేది సరైనదే కానీ.. నచ్చని ఫుడ్ బలవంతంగా ఎలా తింటారని ఒకరు కామెంట్ చేశారు. అయితే.. వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే లక్ష్యంతో ఆ రెస్టారంట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## సరిహద్దులో పరిస్థితులు మెరుగుపడ్డాయ్

### అజిత్ దోభాల్



**న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెలలో చైనాలో పర్యటించనున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ వెల్లడించారు. భారత పర్యటనలో ఉన్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భేటీ సందర్భంగా దోభాల్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. తియాంజిన్ నగరంలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొననున్నారని చెప్పారు.

**పరిస్థితులు మెరుగుపడ్డాయ్..**

చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీతో 24వ ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చలు దిల్లీలో జరిగాయి. ఈ సందర్భంగా అజిత్ దోభాల్ మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిది నెలల్లో సరిహద్దులో పరిస్థితులు మెరుగుపడ్డాయని, ప్రస్తుతం అక్కడ ప్రశాంత వాతావరణం కొనసాగుతుందన్నారు. తాజా ద్వైపాక్షిక చర్చలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్న ఆయన.. ఇరు దేశాధినేతలు కజాన్‌లో భేటీ కావడం ఉద్రిక్తతలను తగ్గించిందన్నారు. చైనాలో జరిగే ఎస్‌సీవో సదస్సుకు ప్రధాని మోదీ హాజరవుతున్నారని అధికారికంగా ప్రకటించారు. వాంగ్ యీ మాట్లాడుతూ.. "కొన్ని ఏళ్లుగా మనం ఎదుర్కొంటున్న సవాళ్లు మన ప్రయోజనాలకు అనుగుణంగా లేవు. మోదీ, జిన్‌పింగ్‌లు కజాన్‌లో భేటీ కావడం, ఆ తర్వాత సరిహద్దులోనూ పరిస్థితులు స్థిరంగా ఉండటం సంతోషకరమైన విషయం. ఎస్‌సీవో సదస్సుకు ప్రధాని మోదీ రాకను స్వాగతిస్తున్నాం. భారత్–చైనాల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు దీర్ఘకాలిక ప్రయోజనాలకు దోహదం చేస్తాయని చరిత్ర, వాస్తవికత రుజువు చేస్తోంది" అని చెప్పారు.

# ముంబయిలో భారీ వర్షాలు..

## 250కి పైగా విమాన సర్వీసులపై ఎఫెక్ట్



**ముంబయి :** ముంబయిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు, రైల్వే లైన్లు, దిగువ ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. దీంతో భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. వాతావరణం అనుకూలంగా లేనందున ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనివల్ల దాదాపు 250కి పైగా విమాన సర్వీసులపై ప్రభావం పడినట్లు అధికారులు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 9.50 గంటల ప్రాంతంలో 8 విమానాలను దారి మళ్లించినట్లు తెలిపారు. విమాన సర్వీసులు సగటున 45 నిమిషాల పాటు ఆలస్యంగా నడుస్తున్నట్లు వెల్లడించారు. ఈమేరకు ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాల సమయాలను సంబంధిత వెబ్‌సైట్లలో చెక్ చేసుకోవాలని సూచించింది. పలు విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. వరదల కారణంగా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో ముందుగానే ఇళ్ల నుంచి బయల్దేరాలని సూచించాయి. మరోవైపు భారీ వరదలకు రైలు పట్టాలు నీట మునిగిపోవడంతో ముంబయి లోకల్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పాఠశాలలు, కళాశాలలు, పలు ప్రభుత్వ కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ప్రైవేటు ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోం చేసుకోవాలని సూచించింది. అవసరమైతే తప్ప ప్రజలకు బయటకురావద్దని ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) విజ్ఞప్తి చేసింది. గత 24 గంటల్లో, నగరంలోని అనేక ప్రాంతాల్లో 200 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. విక్రోలి ప్రాంతంలో అత్యధికంగా 255.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. భారీ వర్షపాతం కారణంగా గంటకు 40–50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.




## ఆన్‌లైన్ బెట్టింగ్ ఇక నేరమే..

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19 :** ఆన్‌లైన్ బెట్టింగ్‌ను అరికట్టే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకురాబోతోంది. దీనికి ప్రధాని మోదీ నేతృత్వంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేసినట్లు– సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ప్రధాని మోడీ అధ్యక్షతన మంగళవారం డిల్లీలో కేంద్ర కేబినెట్ భేటీ– అయ్యింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. భేటీ– అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఆన్ లైన్ బెట్టింగ్‌ను ఇకపై తీవ్ర నేరంగా పరిగణించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వేదికగా బెట్టింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదని, భారీ జరిమానాలు విధించే విధంగా ఆన్ లైన్ గేమింగ్ బిల్లును రూపొందించినట్లు– కేంద్రం తెలిపింది. ఇకపై ఆన్ లైన్ గేమింగ్ ఫ్లాట్‌ఫామ్స్‌పై కేంద్రమే నేరుగా నిఘా పెట్టనుంది. ఆన్ లైన్ బెట్టింగ్ యాప్స్, వెబ్‌సైట్స్ ఆగడాలకు మన దేశంలో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. చేపకు గాలం వేసినట్టు– కొత్త కస్టమర్లకు మొదట్లో రూ. వందకు రూ. రెండొందలు.. రూ. వెయ్యికి రెండు వేలు, మూడు వేలు ఇస్తూ మెల్లిగా ఊబిలోకి లాగుతున్నారు. ఈజీ మనీ కోసం అత్యాశతో కొందరు, వ్యసనాల బారిన పడి ఇంకొందరు.. పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటలు మునిగి తేలుతున్నారు. గతంలో ఈ వ్యసనం కొంతమంది యువత వరకే పరిమితమవగా..ఇప్పుడది ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, సాఫ్ట్వేర్ ఇంజినీర్లు, బ్యాంకర్లు..అనే తేడా లేకుండా ప్రతి రంగానికి చేరింది. ప్రతి వంద మందిలో దాదాపు 95 శాతం మంది చేతులు కాల్చుకుని, ఆర్థికంగా చితికిపోతున్నారు. డబ్బుల కోసం కొందరు అడ్డదారి తొక్కుతుండగా..అవమానంగా భావించేవారు తమ ప్రాణాలతోపాటు కుటుంబ సభ్యుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకపై ఈ ఆన్ లైన్ బెట్టింగ్ ఆగడాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఆన్ లైన్ గేమింగ్ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఏదైనా పెద్ద ఘటన.. లేదంటే కుటుంబ సభ్యులు వీటి బారినపడి బలైన చోట మాత్రమే ఫిర్యాదు ఆధారంగా పోలీసులు స్పందిస్తున్నారు. లేదంటే ఇది తమ పనికాదన్నట్టు– లైట్ తీసుకుంటు–న్నారనే విమర్శలున్నాయి. పలువురు సినీ, క్రీడా ప్రముఖులు ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ యాప్స్‌పై నిషేధం ఉంది. అయిన ప్పటికీ నిఘా వ్యవస్థల కళ్లుగప్పి కొందరు వీటిని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బెట్టింగ్ యాప్స్‌పై చర్యలకు కేంద్రం సిద్ధమైనట్లు– తెలుస్తోంది.

### ఎన్నికల వ్యవస్థ బలోపేతానికి..

## ఆర్నెళ్లలో 28 రకాల చర్యలు : ఈసీ

**న్యూఢిల్లీ :** ఓట్ల చోరీ వంటి ఆరోపణలతో ఎన్నికల సంఘాన్ని ప్రతిపక్షాలు లక్ష్యంగా చేసుకున్నాయి. బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణపైనా ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ పరిణామాల నడుమే ఈసీ కీలక ప్రకటన చేసింది. ఎన్నికల ప్రక్రియను మరింత మెరుగుపర్చడం, క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా గత ఆరు నెలల్లో 28 రకాల చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. మరణాల నమోదు డేటాను అనుసంధానించడం ద్వారా క్షేత్రస్థాయి ఎన్నికల అధికారులకు మృతి చెందిన ఓటర్ల గురించి సకాలంలో సమాచారం అందుతుందని తెలిపింది. ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి.. భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులుబీ ఎన్నికల వ్యవస్థ బలోపేతం, ప్రక్షాళనబీ సాంకేతికత వినియోగం పెంపుబీ ఓటర్ల జాబితాలను సరిచేయడంబీ ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేయడంబీ ఈసీ సామర్థ్యాలను పెంపొందించడం వంటి విభాగాల్లో చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను కీలక సంస్కరణగా పేర్కొంది. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లు లేకుండా చూసుకోవడమే ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని చెప్పింది. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం ఇటీవల ఖండించిన విషయం తెలిసిందే. తమకు ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఓటర్లపై నకిలీలనే ముద్రవేసే ఎత్తులను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. 'ఓట్ల చోరీ' ఆరోపణలపై రాహుల్ గాంధీ వారం రోజుల్లోపు అఫిడవిట్ సమర్పించాలని, లేనిపక్షంలో వాటిని నిరాధారమైనవిగా పరిగణిస్తామన్నారు.




## బిఆర్ఎస్ ముఖ్య నాయకుల ఆత్మీయసమావేశం

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** ఘనంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం సందర్భంగా మంగళవారం అల్విన్ క్రాస్ రోడ్స్ అతిథి బ్యాంకేట్ హాల్ లో శేరిలింగంపల్లి బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ నెల 24 ఆదివారం రోజున కేటీఆర్ అధ్యక్షతన జరగనున్న ఆత్మీయ సమావేశనికి సన్నాహకంగా ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. కార్యక్రమం లో భాగంగా ఆదివారం సమావేశం కోసం విస్తృతంగా చర్చించడం, పార్టీ బలపడి, పూర్వ వైభవం కోసం సూచనలు సలహాలు కార్యకర్తల, నాయకులు, సలహాలు, సూచనలు తెలుసుకోవడం జరిగింది. నియోజకవర్గం భవిష్యత్తు కార్యాచరణ, పార్టీ అభివృద్ధి కి సంబంధించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమం లో కూకట్ పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, వివేకానంద నగర్ కార్పొరేటర్ రోజాదేవి, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు కొమిరిశెట్టి సాయిబాబా, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాధవరం రంగారావు, పురుషోత్తం యాదవ్, వాలా హరీష్ రావు, మిద్దెల మల్లారెడ్డి, రవీందర్ యాదవ్, ఎర్రబెల్లి సతీష్ రావు, మార బోయిన రవి యాదవ్, జమీర్, రోజా, కిరణ్ యాదవ్, గోపరాజు శ్రీనివాస్ రావు, బాబు మియా, భద్రయ్య, రాగం జంగయ్య యాదవ్, అంజమ్మ, దార్గుపల్లి నరేష్, శామ్లెట్ శ్రీనివాస్, దీప్తి రాజు, వెల్లెంకి శ్రీనివాస్ గౌడ్, సిద్దయ్య గౌడ్, శేరిలింగంపల్లి అన్ని డివిజన్ల ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది.

# నాలుగో రోజూ లాభాల్లో సూచీలు..

## 25 వేలకు చేరువలో నిఫ్టీ



**ముంబయి:** జీఎస్టీ విషయంలో కేంద్రం తలపెట్టిన సంస్కరణలు, రష్యా- ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చల్లో పురోగతి కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ సూచీలను ముందుండి నడిపించాయి. ఇతర ఆటోమొబైల్ షేర్లు కూడా రాణించడం సూచీలకు కలిసొచ్చింది. గడిచిన నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1400 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 25 వేల స్థాయికి చేరువైంది. సెన్సెక్స్ ఉదయం 81,319.11 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,273.75) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కొనసాగిన సూచీ.. ఇంట్రాడేలో 81,755.88 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 370.64 పాయింట్ల వద్ద 81,644.39 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 103.70 పాయింట్ల లాభంతో 24,980.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.95గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, రిలయన్స్, ఎటెర్నెల్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బీఈఎల్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.81 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3343 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు చాలా వరకు నష్టాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు లాభాలతో ట్రేడింగ్‌ను ఆరంభించాయి.







## 1 జీబీ డేటా ప్లాన్లను నిలిపివేసిన జియో

ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో ఎంట్రీ లెవల్ ప్రీపెయిడ్ ప్లాన్‌ను సవరించింది. రూ.249 ధరలో 28 రోజులపాటు రోజుకు 1 జీబీ డేటా అందించే ప్లాన్‌ను తాజాగా నిలిపివేసింది. ఇకపై 1.5 జీబీ/డే ప్లాన్‌లే బేస్ ఆప్షన్‌గా అందుబాటులో ఉంటాయి. దీంతో యూజర్లు ఎక్కువ డేటా ఉన్న ఆప్షన్లవైపు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికే ఈ మార్పు అమల్లోకి వచ్చింది. జియో వెబ్‌సైట్‌లో 1జీబీ ఎంట్రీ లెవల్ ప్లాన్ కనుమరుగైంది. ఇక ప్రస్తుతం 28 రోజులకు రూ.299తో 1.5 జీబీ/డే, రూ.349తో 2 జీబీ/డే ప్లాన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.



### ఎయిర్‌పోర్ట్ తరహాలో రైల్వే స్టేషన్లలోనూ

## లగేజీ బరువుపై నిఘా

రైళ్లలో లగేజీపై పట్టుకెళ్లడంపై ఎప్పటి నుంచో నిబంధనలు ఉన్నాయి. ఒక్కో ప్రయాణికుడు తరగతిని బట్టి ఇంతేసి లగేజీని పట్టుకెళ్లడానికి మాత్రమే అనుమతి ఉంది. రైల్వే స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న మౌలిక వసతుల దృష్ట్యా ఈ నిబంధనలు సరిగా అమలు కావడం లేదు. ఇకపై మాత్రం ఈ బ్యాగేజీ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. విమానాశ్రయాల తరహాలో ఇకపై లగేజీని తనిఖీ చేయనున్నారు. తొలుత ప్రధాన రైల్వే స్టేషన్లలో బ్యాగేజీ నిబంధనలను కఠినంగా అమలు చేయనున్నట్లు రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. ఆయా స్టేషన్లలో ప్రయాణికులు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంపై తమ లగేజీ ఉంచాల్సి ఉంటుంది. ఒకవేళ పరిమితికి మించి లగేజీ తీసుకెళుతున్నట్లు గుర్తిస్తే అందుకు అదనపు రుసుము గానీ, పెనాల్టీ గానీ విధించొచ్చు. రైల్వే ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించే ఉద్దేశంతోనే ఈ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

**లగేజీపై పరిమితి ఎంత?**

రైలులో ప్రయాణిస్తున్న తరగతిని బట్టి ఒక్కో వ్యక్తి 35 నుంచి 70 కేజీల వరకు ఉచితంగా లగేజీని తీసుకెళ్లొచ్చు. ఫస్ట్‌క్లాస్ ఏసీలో ప్రయాణించేవారు గరిష్ఠంగా 70 కిలోల వరకు లగేజీని తమ వెంట తీసుకెళ్లొచ్చు. ఏసీ 2-టైర్‌లో ప్రయాణించేవారికి 50 కిలోల వరకు అనుమతిస్తారు. ఏసీ 3-టైర్, స్లీపర్ క్లాస్‌లో ప్రయాణించే వారు 40 కిలోల వరకు లగేజీ ఉచితంగా తీసుకెళ్లొచ్చు. సెకండ్ క్లాస్‌లో ప్రయాణించే వారు 35 కిలోలు మాత్రమే ఉచితంగా తీసుకెళ్లేందుకు వీలుంది. ఒకవేళ అదనపు లగేజీ తీసుకెళ్లాలనుకునేవారు రైలు బయల్దేరడానికి 30 నిమిషాల ముందు లగేజీ కౌంటర్‌ను సంప్రదించడం మంచిది.



## శుభ్‌మన్ గిల్ చక్కగా ఆడుతున్నాడు

### టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్

ఆసియా కప్‌లో పాల్గొనబోయే భారత జట్టును ప్రకటించబోతున్న నేపథ్యంలో గిల్ స్థానం గురించి పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్మెంట్ ప్రకటించిన అనంతరం, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించాడు. ఇంగ్లాండ్ టూర్‌లో టీమ్‌ఇండి యాను చక్కగా ముందుండి నడిపించాడు. అలాగే బ్యాటింగ్‌లోనూ సత్తా చాటాడు. అంతకుముందు ఐపీఎల్ (%ఖ్రూ%) 2025లోనూ గుజరాత్ టైటాన్స్ తరఫున విజృంభించాడు. ఈ సీజన్‌లో అతడు 650 పరుగులు చేశాడు. అయినప్పటికీ టీ20 జట్టులో స్థానం సంపాదించలేకపోతున్నాడు. అభిమానులేమో గిల్ ఆసియాకప్‌లో ఆడాలని కోరుకుంటున్నారు. టీమ్‌ఇండి యా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ మాత్రం భిన్నంగా స్పందించాడు. 'ఒకవేళ శుభ్‌మన్‌గిల్ టీ20ల్లో టీమ్‌ఇండియా కెప్టెన్ అయిఉంటే.. కచ్చితంగా జట్టులో ఉండేవాడు. అప్పుడు సాయిసుదర్శన్, యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీల ప్రస్తావన ఉండేది కాదు. గిల్.. ఓపెనర్ బ్యాటర్‌గా వచ్చేవాడు. అయితే అతడు టీ20 వరల్డ్‌కప్ ప్లానింగ్‌లో లేడు. ఇప్పుడు అకస్మాత్తుగా అతడి పేరెందుకు వినిపిస్తోంది? గిల్ కొంతకాలంగా అద్భుతంగా ఆడుతున్న మాట వాస్తవమే అయినప్పటికీ అతడికి టీ20 జట్టులో స్థానం లభించకపో వచ్చు' అని శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు. ప్రస్తుతం టీ20 జట్టులో స్థానం కోసం ఆటగాళ్ల మధ్య తీవ్రమైన పోటీ ఉంది. ఒక్కో స్థానం కోసం మూడు నుంచి నలుగురు ఆటగాళ్లు పోటీ పడుతున్నారు. దాదాపు 30 మంది క్రికెటర్లు టీ20 జట్టులో స్థానం కోసం ఎదురుచూస్తున్నారు. టాప్ 3 స్థానాల కోసం ఆరుగురు క్రికెటర్లు సెలెక్షన్ కమిటీ దృష్టిలోఉన్నట్లు సమాచారం. అభిషేక్ శర్మ, సంజు శాంసన్, తిలక్ వర్మ.. పొట్టి ఫార్మాట్ జట్టులో పాతుకు పోయారు. అందుకే శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, సాయిసుదర్శన్‌కు ఇప్పు డప్పుడే స్థానం దక్కే అవకాశాలు లేవని క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు.

### రోహిత్ శర్మ.. 2027 వన్డే వరల్డ్ కప్ వరకు

# కెప్టెన్‌గా ఉండాలి

### అంబటి రాయుడు



హిట్ మ్యాన్.. రోహిత్ శర్మ భారతజట్టు వన్డే జట్టు కెప్టెన్‌గా 2027 వరల్డ్ కప్ వరకూ కొనసాగాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అంటున్నాడు. అతడు వన్డే మ్యాచుల్లో టీమ్‌ఇండియాకు చక్కగా దిశానిర్దేశం చేస్తాడని అభిప్రాయపడ్డాడు. 'వచ్చే వరల్డ్ కప్ వరకు టీమ్‌ఇండియాకు రోహిత్ శర్మ సారథ్యం వహించాలి. మన లక్ష్యం వరల్డ్ కప్ సాధించడమే. ఆ సత్తా రోహిత్‌లో ఉంది. రెండేళ్ల తర్వాత ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. కానీ టీమ్‌ఇండియాకు వరల్డ్‌కప్‌ను సాధించి పెట్టే సామర్థ్యం ఎవరిలో ఉందో చూడాలి' అని అంబటి రాయుడు ఓ పాడ్‌కాస్ట్‌లో అన్నాడు. 'ఒక వేళ రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉంటే.. వరల్డ్ కప్‌ను మనం గెలిచే అవకాశం ఎక్కువగా ఉంది. అతడు అప్పటి వరకు తన ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాల్సి ఉంటుంది. వన్డేల్లో రోహిత్ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. అందుకే అప్పటి వరకూ అతడు కచ్చితంగా ఆడాలి' అని అంబటి రాయుడు విశ్లేషించాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని ఇటీవల టీమ్‌ఇండియా.. రోహిత్ శర్మ సారథ్యంలోనే గెలిచింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లోనూ రోహిత్ (76 పరుగులు) మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేశాడు. ఇప్పటి వరకు 273 వన్డేలు ఆడిన అతడు 11168 పరుగులు చేశాడు. ఇందులో 32 సెంచరీలు, 58 హాఫ్ సెంచరీలున్నాయి. 264.. ఈ ఫార్మాట్లో రోహిత్ శర్మకు వ్యక్తిగత అత్యధిక స్కోర్. 67 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన రోహిత్ శర్మ 4301 పరుగులు చేశాడు. ఇందులో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలున్నాయి. 212 వ్యక్తిగత అత్యధిక స్కోర్. 159 టీ20 మ్యాచ్‌లు ఆడిన రోహిత్ 3003 పరుగులు చేశాడు. ఇందులో 5 శతకాలు, 32 అర్ధశతకాలున్నాయి. 121 వ్యక్తిగత అత్యధిక స్కోర్.

## ఆసియా కప్ జట్టును ప్రకటించిన బీసీసీఐ



**ముంబై:** ఆసియాకప్‌లో ఆడే భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఆ టోర్నీకి శుభమన్ గిల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఇవాళ ముంబైలో సమావేశం అయిన బీసీసీఐ సెలెక్టర్ల బృందం భారత జట్టును ప్రకటించింది. మొత్తం 15 మంది ప్లేయర్ల బృందాన్ని వెల్లడించారు. అయ్యర్, జైస్వాల్‌కు చోటు దక్కలేదు. స్టాండ్ బై ప్లేయర్ల జాబితాలో కూడా శ్రేయాస్ అయ్యర్ పేరు లేదు. ఈ టోర్నీ కోసం అయిదుగురు రిజర్వ్ ప్లేయర్లను ప్రకటించారు. ప్రసిద్ధ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, జైస్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్.. రిజర్వ్ లిస్టులో ఉన్నారు. అయితే ఆ జాబితాలో కూడా శ్రేయాస్ అయ్యర్ పేరు లేకపోవడం గమనార్హం. సెప్టెంబర్ పదో తేదీన యూఏఈతో ఇండియా ఫస్ట్ మ్యాచ్ ఆడనున్నది. దుబాయ్ వేదికగానే సెప్టెంబర్ 14వ తేదీన పాకిస్థాన్‌తో హైవోల్టేజ్ మ్యాచ్ జరగనున్నది. ఇక 19వ తేదీన ఒమన్‌తో చివరి రౌండ్ మ్యాచ్ ఆడనున్నది.

**భారత జట్టు.. :**

సూర్యకుమార్ యాదవ్, గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, బుమ్రా, హర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్, హర్షిత్ రాణా, రింకూ సింగ్.




## విరాట్ కోహ్లీ ఓ అద్భుతం

### అంబటి రాయుడు

భారత క్రికెట్ చరిత్రలో విరాట్ కోహ్లీ ఓ అద్భుతమని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అన్నాడు. కోహ్లీకి నైపుణ్యంతో పాటు, ఫిట్‌నెస్ కూడా అదనపు బలమని అతడు కొనియాడాడు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ కోహ్లీ గొప్పదనం గురించి వివరించాడు. 'విరాట్ కోహ్లీ టీమ్‌ఇండియా కోసం ఎంతో చేశాడు. భారత జట్టు రాబోయే వందేళ్లలో ఆధిపత్యం చెలాయించేలా బాటలు వేశాడు. అతడికి ఎంతో నైపుణ్యం ఉంది. దాంతోపాటు చక్కటి ఫిట్‌నెస్ అతడి సొంతం. ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటే.. మానసికంగా కూడా బలంగా తయారవుతారు. ఇది క్రికెట్‌కు ఎంతో అవసరం. కోహ్లీ కేవలం మంచి బ్యాటర్ మాత్రమే కాదు. ఫిట్‌నెస్ విషయంలో టీమ్‌ఇండియాకు అతడో మార్గదర్శి. అతడి వల్లే ఫిట్‌నెస్‌లో భారత జట్టు అత్యున్నత ప్రమాణాలను అందుకుంది' అని అంబటి రాయుడు విశ్లేషించాడు. కోహ్లీ ఇంకొంతకాలం రెడ్‌బాల్ క్రికెట్ ఆడి ఉండాల్సిందని అతడు అభిప్రాయపడ్డాడు. 'నా ఉద్దేశం ప్రకారం విరాట్ కోహ్లీ కాస్త తొందరగానే టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు. అతడు ఇంగ్లాండ్ టూర్‌లో భాగమై ఉంటే బాగుండేది. ఫిట్‌నెస్ పరంగా చూసుకుంటే.. అతడు ఇంకా చాలా ఏళ్లు క్రికెట్ ఆడగలడు. అయితే ప్రస్తుతం కోహ్లీ సంతోషంగానే ఉన్నాడు అనుకొంటున్నా' అని అంబటి రాయుడు వివరించాడు. ఇప్పటివరకు 123 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ.. 9,230 రన్స్ చేశాడు. ఇందులో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలున్నాయి. 254లి.. టెస్టుల్లో అతడి అత్యధిక స్కోర్. అలాగే 125 టీ20 మ్యాచ్‌ల్లో 4,188 రన్స్ సాధించాడు. ఇందులో ఒక శతకం, 38 అర్ధ శతకాలున్నాయి. 122లి అతడి వ్యక్తిగత అత్యధిక స్కోర్. 302 వన్డేల్లో టీమ్‌ఇండియాకు ప్రాతినిధ్యం వహించిన కోహ్లీ.. 14,181 పరుగులు చేశాడు. ఇందులో 51 శతకాలు, 74 అర్ధశతకాలున్నాయి. ఇప్పటి వరకు వన్డేల్లో అతడి అత్యధిక స్కోర్ 183.

## రూ.399కే 'చాట్‌జీపీటీ గో'.. ఫీచర్లు ఇవే




భారత్‌లో 'చాట్‌జీపీటీ గో' పేరుతో ఓపెన్ ఏఐ కొత్త సేవలను ప్రకటించింది. రూ.399కే ఈ ప్లాన్ అందుబాటులో ఉండనున్నట్లు తెలిపింది. మెసేజ్‌లు, ఇమేజ్ జనరేషన్, ఫైల్ అప్‌లోడ్‌ల సంఖ్యను భారీగా అనుమతించనుంది. ఇండిక్ లాంగ్వేజీ సపోర్టుతోపాటు యూపీఐతోనూ చెల్లింపులు చేసే సౌలభ్యాన్ని తీసుకొచ్చినట్లు తెలిపింది. "ఉచిత ప్లాన్‌తో పోలిస్తే జీపీటీ గో'లో మెసేజ్ లిమిట్, ఇమేజ్ జనరేషన్, ఫైల్ లేదా ఇమేజ్ అప్‌లోడ్‌లు 10 రెట్లు ఎక్కువగా ఉండనున్నాయి. మెమొరీ కూడా ఉచిత ప్లాన్‌తో పోలిస్తే రెండింతలు ఎక్కువగా ఉండనుంది. భారత్‌లో ఓపెన్ ఏఐ టూల్స్‌కు భారీగా పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ఈ అధునాతన కృత్రిమ మేధ టూల్స్‌ను అందుబాటులో ధరల్లో అందించేందుకు 'చాట్‌జీపీటీ గో' పేరుతో కొత్త ప్లాన్‌ను ప్రవేశపెడుతున్నాం" అని తాజా ప్రకటనలో వెల్లడించింది. ఇదివరకే అందుబాటులో ఉన్న రూ.1999 చాట్‌జీపీటీ ప్లస్ ప్లాన్‌కు అదనంగా ఇది ఉండనుంది. దీంతోపాటు నిపుణులు, సంస్థల కోసం ఇప్పటికే ప్రో ప్లాన్‌కు రూ.19,900తో అడ్వాన్స్‌డ్ ఫీచర్లను అందిస్తోన్న విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని చాట్‌జీపీటీ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ నిక్ టర్లీ పేర్కొంటూ.. భారత్‌లో లెర్నింగ్, వర్క్, క్రియేటివిటీ, ప్రాబ్లమ్-సాల్వింగ్ కోసం నిత్యం లక్షలాది మంది యూజర్లు చాట్‌జీపీటీని ఎలా ఉపయోగిస్తున్నారనే విషయం నుంచి ఓపెన్ ఏఐ ప్రేరణ పొందుతోందన్నారు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు 'చాట్‌జీపీటీ గో'ను ప్రవేశపెడుతున్నామన్నారు. ధరలు కూడా భారత కరెన్సీలోనే కనిపించనున్నాయన్న ఆయన.. ఇతర దేశాలకు విస్తరించే ముందు భారత్‌లో వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఓపెన్ ఏఐ అత్యంత అడ్వాన్స్‌డ్ ఏఐ మోడల్ చాట్‌జీపీటీ-5ను ఇటీవలే పరిచయం చేసింది. ఆ సందర్భంగా ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ మాట్లాడుతూ.. చాట్‌జీపీటీని మార్కెట్‌లలో రెండో స్థానంలో ఉన్న భారత్ త్వరలోనే అతిపెద్ద మార్కెట్‌గా అవతరించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు, నిపుణులు, డెవలపర్లు, క్రియేటర్లు, సంస్థలకు చెందిన లక్షలాది మంది యూజర్లతో వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. ఓపెన్ ఏఐ ఇప్పటివరకు తయారుచేసిన అత్యంత శక్తిమంతమైన మోడల్‌గా దీనిని పేర్కొంది.



## '90 పని గంటల'పై వ్యాఖ్యలు..

### నా భార్య కూడా బాధ పడింది : ఎల్అండ్‌టీ సీఎండీ

వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారం సెలవును కూడా వదిలేయాలని ఎల్ అండ్ టీ సీఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ గతంలో చేసిన వ్యాఖ్యలు ఆన్‌లైన్‌లో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను పలువురు ప్రముఖులు వ్యతిరేకించారు. ఈవిషయంపై తాజాగా సుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ.. గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తంచేశారు. భార్యను ఎంతసేపు చూస్తూ ఉండిపోతారని అన్న మాటలకు తన భార్య కూడా బాధ పడిందని.. ఇకపై అటువంటి విషయాల్లో ఆచితూచి మాట్లాడతానని అన్నారు. కంపెనీకి సంబంధించిన ముఖ్యమైన ప్రాజెక్టుల్లో జాప్యం జరుగుతున్నట్లు ఫిర్యాదు అందడంతో అప్పుడు అలా మాట్లాడానని.. అంతేకానీ ఉద్దేశపూర్వకంగా మాట్లాడలేదని ఆయన స్పష్టం చేశారు. "పని గంటల గురించి మాట్లాడిన సమయంలో కంపెనీకి సంబంధించిన సమస్యల గురించి ఆందోళనలో ఉన్నాను. మా కంపెనీకి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టుల్లో జాప్యం జరుగుతుందని కొందరు హై-ప్రొఫైల్ క్లయింట్లు వ్యక్తిగతంగా నాకు ఫిర్యాదు చేశారు. అత్యుత్తమ పని తీరే మనకు ప్రాణ వాయువు కాబట్టి.. నా సంస్థలో పనులు జరగకపోవడంతో ఆందోళనలో ఆ సమయంలో అలా మాట్లాడాను. అదే.. వేరే పరిస్థితుల్లో అయితే మరోలా మాట్లాడేవాడిని. 'ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు' అన్న మాటలకు నా భార్య కూడా బాధ పడింది" అని సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. కాగా వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారం సెలవునూ వదిలేయాలని ఎల్ అండ్ టీ సీఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు గతంలో ఆన్‌లైన్‌లో దుమారాన్నే లేపాయి. 'ఆదివారాలు మీతో పని చేయించలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. మీతో అలా పని చేయించగలిగితే.. నాకు సంతోషం. ఎందుకంటే నేను ఆదివారాలు పని చేస్తున్నాను' అంటూ వారితో మాట్లాడిన ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో కనిపించింది. 'ఇంట్లో కూర్చొని ఏం చేస్తారు. ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని భార్యలకు చెప్పాలంటూ' చేసిన వ్యాఖ్యలు నెట్టింట్లో వైరల్ కాగా.. నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. ఉన్నతహోదాలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం చూసి ఆశ్చర్యానికి గురయ్యానంటూ బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొణె అసహనం వ్యక్తంచేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా సైతం సుబ్రహ్మణ్యన్ మాటలను వ్యతిరేకించారు. బానిసలా కష్టపడటాన్ని కాకుండా తెలివిగా పనిచేయడాన్ని తాను నమ్ముతానని తెలిపారు.



# నేహాశర్మ దర్శకత్వంలో.. అజయ్ నిర్మాతగా

'సన్ ఆఫ్ సర్దార్ 2' సినిమాతో ఇటీవలే ప్రేక్షకుల్ని అలరించారు బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్. ఇప్పుడు ఆయన తన సొంత నిర్మాణ సంస్థలో ఒక భారీ యాక్షన్ డ్రామాను నిర్మించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ చిత్రంతో నటి నేహా శర్మ తొలిసారి దర్శకురాలిగా మారింది. ఇంకా పేరు ఖరారు కాని ఈ ప్రాజెక్ట్‌లో సిద్ధాంత్ చతుర్వేది, మోహిత్ కీలక పాత్రల్లో నటించనున్నట్లు తెలుస్తోంది. ఇది 1945 నేపథ్యంలో పీరియాడికల్ డ్రామాగా సాగే కథని సమాచారం.



# కమల్, రజనీలతో లోకేశ్ మల్టీస్టారర్ మూవీ

కూలీ సినిమాతో సూపర్ హిట్‌ని అందుకున్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు- తెలుస్తుంది. ఇప్పటికే నటుడు కార్తీతో ఖైదీ 2 సినిమాను లైన్‌లో పెట్టిన లోకేష్.. ఈ సినిమా కంటే ముందే మరో బిగ్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించబోతున్నాడని సమాచారం. సూపర్ స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్‌లతో కలిసి కలిసి లోకేష్ ఒక భారీ మల్టీస్టారర్ చేయబోతున్నట్లు- కోలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇద్దరు వయసు మళ్లిన గ్యాంగ్‌స్టర్ల కథ అని తెలుస్తుంది. ఇద్దరు లెజెండరీ నటుల ఇమేజ్‌కు తగ్గట్టుగా లోకేష్ కనగరాజ్ ఈ కథను సిద్ధం చేశాడని.. ఈ కథకు ఇద్దరు హీరోలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రాన్ని కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ అయిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మించనుందని సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రకటన రాబోతుంది.

# శశివదనే' అక్టోబర్ 10న భారీ ఎత్తున విడుదల



**ఫిలింనగర్, ఆగస్టు 19:** రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్ కంపెనీ, ఎస్‌వీఎస్ స్టూడియోస్ బ్యానర్ల మీద అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోదాల నిర్మించిన చిత్రం 'శశివదనే'. ఈ మూవీకి సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్ ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఫీల్ గుడ్ వింటేజ్ విలేజ్ లవ్ స్టోరీగా తెరకెక్కించిన 'శశివదనే' చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను మేకర్లు సోమవారం నాడు ప్రకటించారు.'శశివదనే' చిత్రాన్ని దసరా సీజన్‌లో అక్టోబర్ 10న భారీ ఎత్తున విడుదల చేయబోతోన్నట్టుగా నిర్మాతలు ప్రకటించారు. ఈ మూవీకి శ్రీ సాయి కుమార్ దారా అందించిన విజువల్స్, శరవణ వాసుదేవన్ ఇచ్చిన సంగీతం ప్రధాన ఆకర్షణ కానున్నాయి. ఓ అందమైన ప్రేమ కథా చిత్రానికి విజువల్స్, మ్యూజిక్ ఎంత ప్రాముఖ్యం అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 'శశివదనే' మూవీని మేకర్స్ ఓ దృశ్యకావ్యంగా మలిచారు. ఈ సినిమాకు అనుదీప్ దేవ్ అందించిన నేపథ్య సంగీతం మేజర్ అస్సెట్ కానుంది.

# రీ ఎంట్రీతో చాలా హ్యాపీ

## ఆర్గాన్‌తో శ్రీదేవి

నారా రోహిత్ మైల్ స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. వృతి వాఘాని, శ్రీ దేవి విజయ్ కుమార్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. టీజర్, పాటలు, ట్రైలర్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ దేవి విజయ్ కుమార్ విలేకరుల సమావేశంలో ఆర్గాన్ న్యూస్ తో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**రీఎంట్రీలో కూడా హీరోయిన్‌గా వస్తున్నారు ..ఎలా ఫీలవుతున్నారు?**

చాలా హ్యాపీగా ఉంది. ఏ యాక్టర్ కైన మంచి క్యారెక్టర్ చేయాలని ఉంటుంది. ఏదైనా క్యారెక్టర్ స్ట్రాంగ్ గా ఉండాలి. ఇందులో చాలా మీనింగ్ ఫుల్ క్యారెక్టర్ చేస్తున్నాను. అన్ని చోట్ల నుంచి చాలా మంచి అప్రిషియేషన్స్ వస్తున్నాయి. ఇది చాలా ఆనందాన్ని ఇచ్చింది. చాలా కొత్త పాయింట్ తో వస్తున్న ప్రాజెక్టు. ఒక ఆడియన్ గా ఈ సినిమా నాకు చాలా నచ్చింది. అవుట్ ఫుట్

**మీరు సినిమాలకి బ్రేక్ ఇవ్వడానికి కారణం ఏమిటి?**

నేను హీరోయిన్ గా చేస్తున్న రోజుల్లోనే పెళ్లి చేసుకున్నాను. పెళ్లి ఇంట్లో ముందుగానే ప్లాన్ చేశారు. తర్వాత అమ్మాయి పుట్టింది. అలా సినిమాలకి ఒక బ్రేక్ వచ్చింది. ఆ తర్వాత టీవీలో కొన్ని ప్రోగ్రామ్స్ చేశాను. ఇన్ని సంవత్సరాల గ్యాప్ తర్వాత స్క్రీన్ మీద చూసుకోవడం చాలా ఎక్సైటింగ్ గా ఉంది. లాస్ట్ ఇయర్ ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ అయింది. అది కూడా చాలా మంచి ఎక్స్పీరియన్స్ ఇచ్చింది. ఇప్పుడు మా అమ్మాయి పెద్దదయింది. మరిన్ని సినిమాలు చేయడానికి అవకాశం దొరికింది.

**సుందరకాండలో మీ క్యారెక్టర్ చెప్పినప్పుడు ఎలా అనిపించింది?**

డైరెక్టర్‌ఈ కథ చెప్పగానే షాక్ అయ్యాను. చాలా కొత్త స్క్రిప్ట్ నా క్యారెక్టర్ లో చాలా డిఫరెంట్ ఎమోషన్స్ ఉన్నాయి. చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను. ఇందులో ఫిమేల్ క్యారెక్టర్స్ అన్నీ చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఇందులో ఈ స్కూల్ డ్రెస్ వేసుకునే అవకాశం వచ్చింది. అది చాలా మెమొరబుల్ ఎక్స్పీరియన్స్. చాలా ఫోటోలు తీసి దాచుకున్నాను. ఇది ఒక మెమొరబుల్ క్యారెక్టర్. ఇప్పటివరకు నేను ఇలాంటి క్యారెక్టర్ చేయలేదు.



చాలా అద్భుతంగా వచ్చింది. చాలా ఫ్రెష్ కంటెంట్. అందరూ థియేటర్ కి వెళ్లి చాలా ఎంజాయ్ చేయొచ్చు.

**ఇండస్ట్రీలో అప్పటికి ఇప్పటికి ఎలాంటి మార్పులు గమనించారు?**

అప్పటికి ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయి. మొత్తం మారిపోయింది. ఇప్పుడు టెక్నికల్ గా ఇంకా ఈజీ అయింది. డైరెక్షన్ డిపార్ట్మెంట్ వర్కింగ్ స్టైల్ మారింది. నాకు అంతా కొత్తగా అనిపించింది.

**నారా రోహిత్ గారి గురించి?**

నారా రోహిత్ గారు నాకు ఎప్పటి నుంచో తెలుసు. ఆయన చాలా కూల్ ఉంటారు. చాలా మంచి పర్సన్. ఆయనతో వర్క్ చేయడం చాలా హ్యాపీనెస్ ఇచ్చింది.

**ప్రభాస్ గారు మీరు ఒకేసారి ఈశ్వర్ సినిమాతో లాంచ్ అయ్యారు.. మీ మధ్య ఫ్రెండ్షిప్ ఎలా ఉంది?**

ఫ్రెండ్షిప్ అలానే వుంది. ప్రభాస్ గారు ఇప్పుడు ఇంకా బిగ్ స్టార్ అయ్యారు. అయినప్పటికీ ఆయనలో ఎలాంటి మార్పు లేదు. ఇప్పటికి కూడా ఆయన చిన్నపిల్లాడిలానే నవ్వుతూ మాట్లాడతారు. ఈశ్వర్ సినిమా సమయంలోనే ఆయన పెద్ద సూపర్ స్టార్ అవుతారని మేమంతా అనుకున్నాం. ఆ సినిమా సక్సెస్ టూర్ కి వెళ్తున్నప్పుడు చాలా పెద్ద ఎత్తున జనం వచ్చేవారు. మేము ఊహించినదానికంటే ఆయన పెద్ద స్టార్ అయ్యారు. నిజంగా అదొక బ్లెస్సింగ్.

**డైరెక్టర్ వెంకీ గురించి?**

వెంకీ గారికి ఇది మొదటి సినిమా. కానీ చాలా ఎక్స్పీరియన్స్ ఉన్న డైరెక్టర్ లాగా తీశారు. ఆయన విజన్ చాలా క్లియర్ గా ఉంది. తనకి ఏం కావాలో క్లారిటీ ఉంది. ఆయనతో వర్క్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.

**ఎలాంటి క్యారెక్టర్స్ చేయాలనుకుంటున్నారు?**

నాకు అన్ని రకాల క్యారెక్టర్స్ చేయాలని ఉంది. కథలో మంచి ప్రాధాన్యత వుండే స్ట్రాంగ్ క్యారెక్టర్స్ చేయాలని భావిస్తున్నాను.

**మీరు తెలుగు చాలా చక్కగా మాట్లాడుతున్నారు?**

నేను హీరోయిన్ గా తెలుగులోనే ఎక్కువ సినిమాలు చేశాను. అలాగే మా అమ్మగారు తెలుగులో ఎక్కువ వర్క్ చేశారు. మా ఇంట్లో తెలుగులోనే మాట్లాడుతూ ఉంటాం. నేను ఈశ్వర్ టైంలోనే తెలుగు నేర్చుకున్నాను.

**లియోన్ జేమ్స్ మ్యూజిక్ గురించి?**

లియోన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఇందులో సిద్ శ్రీరామ్ పాడిన పాట నాకు చాలా ఇష్టం. ఇందులో ప్రతి పాట చాలా డిఫరెంట్ గా ఉంటుంది. అలాగే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా అదిరిపోతుంది. ఈ సినిమాకి మ్యూజిక్ ప్లస్ పాయింట్.

**మీరు ఈశ్వర్ టైం లో ఎలా ఉన్నారో ఇప్పుడు అలాగే ఉన్నారు హెల్త్ సీక్రెట్ ఏంటి?**

ఆనందంగా ఉండడం. దాంతో పాటు గాడ్ బ్లెస్సింగ్ కూడా అనుకుంటాను. ఈ సినిమా కోసం ఒక నెల రోజులు ముందుగానే డైట్ ప్లాన్ చేశాను.

# 'సినిమా ఆగితే పస్తులతో పడుకోవాల్సిందే'

## దర్శకుడు వి.ఎన్. ఆదిత్య

ఒక్క వ్యక్తి సినిమాల్లోకి వచ్చి, డబ్బులొస్తేనే తీస్తాను, రాకపోతే వేరే వ్యాపారం లో పెడతాను అనుకోకుండా, లాభమొచ్చినా సినిమాలే తీస్తూ, నష్టమొచ్చినా సినిమాలే తీస్తూ తన బయటి వ్యాపారాలలో వచ్చిన లాభాలు కూడా సినిమా రంగం మీదకే మళ్లిస్తూ ఈ రంగం లో పదేళ్ల లో దాదాపు వెయ్యికోట్ల పైగా పెట్టుబడి పెట్టుకుని, ఫ్లాపుల్ని, ట్రోలింగులని ఎదురీదుతూ మొండిగా తట్టుకుని నిలబడితే.. ఆయన్ని ఎంకరేజ్ చేసి మరిన్ని మంచి సినిమాలు చేసేలా ప్రోత్సహించాల్సింది పోయి, అబద్ధపు ప్రచారాలతో, స్వార్ధపూరిత రాజకీయాలతో, కుల వివక్షలతో ఈ రంగం మీద పెట్టుబడిని బయటి రంగాలకి మళ్లించేలా మన ప్రవర్తన ఉంటే ఎవడికిరా నష్టం యాభై సినిమాలకు రెండొందల మందికి పైగా పదేళ్ల లో ఆయన పెట్టిన మూడు పూటల భోజనం ఖర్చు మాత్రమే ఒక పది పెద్ద సినిమాల బడ్జెట్టు,కారు డ్రైవర్లకి, ప్రొడక్షన్ బాయ్స్ కి డబ్బులెగ్గొట్టి, హీరో, హీరోయన్స్ కి మాత్రమే డబ్బులిచ్చి, బడా ప్రొడ్యూసర్స్ లా మార్కెట్ లో పోజు కొట్టే చాలామందిని ఒక్క మాట అనలేని యూనియన్ లీడర్లు ఈయన మీద మాత్రం విరుచుకు పడిపోతారు.. ఏ కార్మిక సంఘం అయినా వర్కర్ కి అన్యాయం చేసిన ప్రొడ్యూసర్ పై పడాలి.. వేలమంది వర్కర్స్ కి పని కల్పించే ప్రొడ్యూసర్స్ మీద కాదు.. ఈ సమ్మె వల్ల కడుపులు కాలుతున్న కార్మికులు లక్షల్లో ఉన్నారు తెలుగు ఇండస్ట్రీ లోవాళ్ల ఆకలి బాధలకు ఏ యూనియన్ నాయకుడు సమాధానం చెప్తాడు.. కళారంగంలో పని దొరకడమే మొదటి ప్రాధాన్యత,దానిని ఆపే సంఘాలు ఉన్నా ఒకటే..ఊడినా ఒకటే చేతనైతే యూనియన్లు అన్నీ కలిసి ఒక్క రోజు షూటింగ్ జరిగేందుకు దోహదపడాలి.. ఆపడానిక్కాదు,ఎన్నుకున్న నాయకులు షూటింగులకు అంతరాయం కలగకుండా సమస్యలకు పరిష్కారం తేవాలి అది సామర్ధ్యం అంటే,పనుంటే గాని డబ్బు, అన్నం దొరకని పరిశ్రమలో పని ఆపి, ఎవ్వరూ ఎవ్వరినీ ఉద్ధరించలేరు.నేను ఏ యూనియన్ లో అయినా సాధారణ సభ్యుడినే గానీ, ఏ పదవిలోనూ ప్రస్తుతం లేను.అయినా నాకేం తెలుసని



ఈ పోస్ట్ పెట్టానని ఎవరైనా అనుకుంటే.. ముప్పై అయిదేళ్లుగా సినిమా రంగంలో వస్తున్న ప్రతి మార్పు కి ప్రత్యక్ష సాక్షి ని నేను.. నా అనుభవాన్ని మించిన అర్హత లేదు అని కచ్చితంగా చెప్పగలను.రెండు శాతం సక్సెస్ రేటున్న రంగానికి ఇన్వెస్ట్ మెంట్లు తెప్పించడం చాలా కష్టం.. రెండు వేల ఎనిమిది నుండి నా ద్వారా వచ్చిన పెట్టుబడులు రెండు వేల కోట్లు,రాబోయే పెట్టుబడులు మరో వేయి కోట్ల పైనే నా వల్ల వచ్చిన గౌరవంముప్పై రెండు జాతీయ,అంతర్జాతీయ స్థాయి పురస్కారాలు ఇంతకన్నా అర్హత కావాలా మాట్లాడడానికి..? నిర్మాతల్ని సినిమాలు తీయనివ్వండి కార్మికులు బావుంటారు షూటింగులు ఆపకండి అడుక్కు తినాల్సి వస్తుంది.సినిమా అనేది పని చేసేవాడికి మాత్రమే పరమాన్నం పెడుతుంది పని లేని రోజున పస్తులు పడుకో పెడుతుంది ఇది తెలుసుకుని మసలుకోండి.

# సందేశ సినిమాల్లో నారాయణమూర్తిదే పైచేయి

## నటుడు బ్రహ్మానందం కితాబు

ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యూనివర్సిటీ- పేపర్ లీక్'. ఇది ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో టీమ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి బ్రహ్మానందం ముఖ్యఅతిథి గా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆర్.నారాయణమూర్తితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈరోజు మన దేశ విద్యావ్యవస్థ మారిపోయింది. అది ఎలా ఉంది అనే అంశంపై తమ్ముడు నారాయణమూర్తి రూపొందించిన గొప్ప చిత్రమిది. నాకు ఆయన 40 సంవత్సరాలుగా తెలుసు. నిరంతరం ప్రజల గురించే ఆలోచిస్తారు. ఈ సినిమా కూడా పేద ప్రజల కోసమే తీశారని అన్నారు. నారాయణమూర్తి ఎన్నో త్యాగాలు చేశారు. ఆయన జీవితం మీకు అంకితం. చివరిశ్వాస వరకూ మీకోసం కష్టపడుతూనే ఉండాలని కోరుకుంటున్నాను. ఇది ఎంతో అందమైన సినిమా. ఇందులో నిజాలుంటాయి.. బూతులు ఉండవు, జీవితపు లోతులుంటాయి. 'పెద్ద వాళ్లకు కావాలంటే నాలో అమ్మడానికి చాలా ఉన్నాయి.. కిడ్నీ కూడా ఉంది' అంటూ సాగే కొన్ని డైలాగులు వింటే హృదయం కదిలిపోయింది. ఈ సినిమాను అందరూ చూడాలి. అర్థం చేసుకోవాలి. సమాజం బరువు మోసే వ్యక్తి నారాయణమూర్తి. ఆయన ఒక శక్తి అన్నారు. నారాయణమూర్తి చేసినన్ని మంచి పనులు నేను చేయలేదు. చేస్తానో, లేదో కూడా తెలియదు. నాకు తెలిసినప్పటినుంచి ఆయన ఒకేలా ఉన్నారు. అవే చెప్పులు.. అదే ప్యాంటు-షర్ట్.. అదే ఆటో. ఒక్క సినిమా హిట్ అయితే ఈ రోజుల్లో మనం ఎలా ప్రవర్తిస్తున్నామో అందరికీ తెలుసు. 40 సంవత్సరాల కెరీర్‌లో ఎంతోమంది ఎన్నో ప్రలోభాలు పెట్టినా వాటికి తలొంచలేదు. నాకు వెంకటేశ్వరస్వామి



అంటే ఇష్టం.. నారాయణమూర్తి అంటే ఇష్టం' అని అన్నారు. ఇక సినిమాను ఉద్దేశిస్తూ.. ఈ దేశాన్ని మళ్లీ బడిలో వేయాలి అని బ్రహ్మానందం చెప్పారు. నారాయణమూర్తి మాట్లాడుతూ.. 'తెలుగు చిత్ర పరిశ్రమలో బ్రహ్మానందం మహానటుడు, మహాజ్ఞాని. అన్నిటికీ మించి మాస్టారు. అందుకే ఈ సినిమాను ఆయనకు చూపించాను. ఆయన వెంటనే నా విజ్ఞప్తిని మన్నించి 'యూనివర్సిటీ'ని చూశారు. నన్ను ఆశీర్వదించారు. ఆయన స్పీచ్ వింటుంటే నాకు ఆనందబాష్పాలు ఆగలేదు' అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com